జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 5 సంచిక 29 | హైదరాబాద్, నవంబరు 19 శుక్రవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

# దేశంలో జెండా లేవాల్సిందే..

## రైతుల కోసం టీఆర్ఎస్ లీడర్‌షిప్ తీసుకుంటుంది



హైదరాబాద్, నవంబరు 18, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో పండే వడ్లు కొంటారా కొనరా అని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ఈ దేశాన్ని నడవడంలో అన్ని పార్టీలు దారుణంగా విఫలమయ్యాయని ఆయన అన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో టీఆర్ఎస్ చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 'భారత దేశం మొత్తం ఈ గోస ఉంది. ఈ దేశాన్ని నడపడంలో అన్ని పార్టీలు దారుణంగా విఫలం అయ్యాయి. రైతులను కేంద్రం బతకనిస్తుందా లేదా? ధాన్యాన్ని నిల్వ చేసే సామర్థ్యం ఏ రాష్ట్రానికి లేదు. విషయం అర్థం చేసుకోలేని ఇంగిత జ్ఞానం కేంద్రానిది. డొంక తిరుగుడు మాటలతో రైతులను మభ్య పెడుతున్నారు. యాసంగి వరి వేయొద్దని చెప్పడం నాకు భాదేస్తోంది. పచ్చి అబద్ధాలతో దేశాన్ని నడుపుదామనుకుంటున్నారా? ఓపికకు హద్దు ఉంటుంది. సభలో సీఐడీ వాళ్ళు ఉన్నారు. మోదీకి పది నిమిషాల్లో నేను మాటాడింది తెలుస్తుంది. వరి వేయాలని ఆర్డర్ తీసుకురావాలని అడిగితే సమాధానం లేదు. వరి కొనకపోతే వడ్లు మీ బీజేపీ ఆఫీస్ గుమ్మం ముందు పోస్తం. పదవులు మాకు లెక్క కాదు. అవసరం అయితే రైతుల కోసం టీఆర్ఎస్ లీడర్?షిప్ తీసుకుంటుంది. రైతు వ్యతిరేక చట్టాలపై చివరి రక్తపు బొట్టు వరకు పోరాటం చేస్తాం. మీ సరిహద్దు నాటకాలు, సర్జికల్ స్ట్రైక్?లు బట్టబయలు అయ్యే సమయం వచ్చేసింది. ఎన్నికలు వస్తే మతకలహాలు రెచ్చగొడుతారు. ఈ పోరాటం వడ్లతో స్టార్ట్ అయింది. దేశం కోసం కూడా పోరాటం చేస్తాం. ఈ గోల్ మాల్ మాటలు మాట్లాడుతున్న వాళ్లకు చరమ గీతం పాడాల్సిందే.

(మిగతా 2లో..)



# బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయి

ఢిల్లీ, నవంబరు 18, ప్రజాపాలన ప్రతినిధి:దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా తయారైందన్నారు ప్రధాని మోడీ. దీనికి కారణం.. బ్యాంకింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు, గత ఆరేడేళ్ల నుంచి ఆ రంగానికి లభిస్తున్న మద్దతేనని అన్నారు. బిల్డ్ సినర్జీ ఫర్ సీమ్‌లెస్ క్రెడిట్ ఫ్లో అండ్ ఎకనామిక్ గ్రోత్ అన్న అంశంపై జరిగిన చర్చలో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 కన్నా ముందు ఉన్న అన్ని సమస్యలకు తాము దారులు వెతికినట్లు ప్రధాని మోడీ చెప్పారు. %చీజూ% సమస్యలను, బ్యాంకుల రిక్యాపిటలైజేషన్, ఐబీసీ సంస్కరణలు చేపట్టామన్నారు. అప్పుల రికవరీ కోసం ట్రిబ్యునల్‌ను బలోపేతం చేసినట్లు తెలిపారు. కరోనా టైంలో కూడా బ్యాంకులు మెరుగ్గా కోలుకున్నట్లు చెప్పారు. బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయని, వాటిలో కొత్త శక్తి వచ్చినట్లు ఆయన తెలిపారు. బ్యాంకుల

(మిగతా 2లో..)



# తిరుపతిలో చిక్కుకున్న భక్తులకు వసతి

తిరుపతి, నవంబరు 18 ప్రజాపాలన ప్రతినిధి: తిరుపతిలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే వారికి అన్ని విధాల సౌకర్యం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చర్యలు చేపట్టింది. భారీ వర్షాల కారణంగా తిరుపతి లో చిక్కుకు పోయిన భక్తులకు వసతి ఏర్పాటు చేసింది. వసతి కోసం

(మిగతా 2లో..)

# ఏసిలో కూర్చుని కాదు.. కల్లాల దగ్గర ధర్నా చేయాలి



హైదరాబాద్,నవంబరు 18, ప్రజాపాలన ప్రతినిధి:రైతుల పక్షాన పోరాటం చేయాలంటే..కల్లాల దగ్గరకు వెళ్లాలన్నారు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. రైతు సమస్యలు, ధాన్యం కొనుగోళ్లపై గురువారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ నుంచి వ్యవసాయ కమిషనరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఆ తర్వాత వ్యవసాయ కమిషనర్ కు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కేంద్ర, రాష్ట్ర సర్కార్ లు.. జేఏసీ గా ఏర్పడి రైతులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.యి. జేఏసీ అంటే..జాయింట్ ఆక్టింగ్ కమిటీ అని అన్నారు. ఇందిరా పార్క్ దగ్గర సీఎం కేసీఆర్.. రైతుల పక్షాన ఏం మాట్లాడుతారో అని ఎదురు చూసినమన్నారు.కానీ..ఇందిరా పార్క్ దగ్గర ఏర్పాట్లు చూస్తే.. పరేషాన్ అవుతారన్నారు. ఏసీల్లో కూర్చుని ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రైతుల పక్షాన పోరాటం చేయాలంటే.. రైతుల కల్లాల వద్దకు వెళ్లాలని సూచించారు. లేదంటే చనిపోయిన రైతు కుటుంబాలను పరామర్శించాలన్నారు.బండి సంజయ్, కిషన్ రెడ్డి..ఢిల్లీకి వెళ్లి మోడీని నిలదీయాలన్నారు రేవంత్ రెడ్డి. సహారా కుంభకోణం లో కేసీఆర్ ను కేంద్రమే కాపాడుతోందన్న ఆయన..నేను చేసిన ఫిర్యాదులు తొక్కిపెడుతున్నారని ఆరోపించారు.

# తెలంగాణ రాష్ట్రం వచ్చాక.. రాజకీయాలు దిగజారాయి

## బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



హైదరాబాద్,నవంబరు 18, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయని హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో మాజీ మంత్రి రామస్వామి బుల్లెట్ పైనే అసెంబ్లీకి వచ్చేటోడని ఆయన గుర్తు చేసుకున్నారు. గురువారం గురువారం గౌలిగూడలో శ్రీ విఠలేశ్వర బాల భక్త సమాజం ఆధ్వర్యంలో మాజీ మంత్రి రామస్వామి 85వ జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామితో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామస్వామి విగ్రహాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రామస్వామి ఆవిష్కరించారు.

(మిగతా 2లో..)

# మరో పదేళ్లు కుటుంబపాలన సాగించాలనేదే కేసీఆర్ పన్నాగం



హైదరాబాద్, నవంబరు 18, ప్రజాపాలన ప్రతినిధి:ధాన్యం కొనుగోలు విషయంలో టీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీ ధర్నాలు ఓ రాజకీయ డ్రామా అని బీఎస్పీ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మరో పదేళ్లు కుటుంబపాలన సాగించాలనేది కేసీఆర్ పన్నాగమని ఆయన అన్నారు.'హుజూరాబాద్‌లో ఈటల ఓడిపోవాలని అనేక కుట్రలు చేసి.. ఘోర పరాజయం చవి చూసి, అతని విజయాన్ని తట్టుకోలేక, కేంద్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీ ధర్నాలు చేయడం ఓ రాజకీయ డ్రామా. ఇది కార్పొరేట్ శక్తులు పన్నిన వలలో అన్నదాతలను ఇరికించే ఘోరమైన కుట్ర. జాగో తెలంగాణ..రోహిత్ వేముల బలవన్మరణం, మాతృభూమిలోనే మైనారిటీలను నిర్వాసితులను చేసే సీఏఏ చట్టం, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దుకు వ్యతిరేకంగా, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం ఏనాడూ ధర్నా చేయని టీఆర్ఎస్.. నేడు రైతుల కోసం ధర్నా చేయడం హాస్యాస్పదం.




స్నేహా గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్స్

ఆహ్వానం

Anniversary Celebrations
&
Felicitation of outstanding personalites from different fields

| తేది | వేదిక | సమయం |
| --- | --- | --- |
| 28-11-2021 | డా.ఎన్.టి.ఆర్. కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ | 2PM TO 9PM |

1. స్నేహా క్లబ్ -2001 పే బ్యాక్ టూ సొసైటీ
2. స్నేహా పెళ్లి పిలుపు -2001 ఫర్ లాంగ్ లాస్టింగ్ రిలేషన్‌షిప్
3. స్నేహా మ్యాక్స్ -2008 పేదల ఆర్థిక అభివృద్ధి
4. స్నేహా స్ఫూర్తి చిట్‌ఫండ్ -2009 సంస్థల లాభాలు పేదల విద్య కొరకు
5. స్నేహా టీవీ -2014 కేంద్రీకరణ పద్ధతిలో పార్లమెంటరీ స్థాయిలో యాజమానుల నియామకం
6. ప్రజాపాలన - 2016 మండల పరిధిలో యజమానులను నియమించడం
7. అంబేడ్కర్ టీవీ -2019 వికేంద్రీకరణ పద్ధతిలో అసెంబ్లీ నియోజక వర్గాలలో యాజమానుల నియామకం
8. స్నేహ ఫార్మ్ ఈజీ -2019 డిస్కౌంట్ లో మీ ఇంటి వద్దకే మందులు, మీ ఇంట్లోనే పరీక్షలు
9. పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి -2020 రాజ్యాధికార సాధన కోసం అవగాహన కల్పించే
10. బహుజన్ బిజినెస్ పేజస్ -2020 (ఎల్లో పేజస్ ) నెట్ వర్కింగ్
11. బహుజన్ బజార్ -2020 ఆన్ లైన్ షాపింగ్

Sneha Directors / Privileged Members

NERELLA KOTESWARA RAO
DGM BSNL Rtd. & Director, Master Key Tv
9440053858

Prof. Dr. N. VENKATESWARULU
Principal osmania Dental college Retd & Director, Master Key TV
9849031420

GOLLA KENNY BOB
Director, Master Key TV
9490804553

Prof.RACHAMALLA SHYAM SUNDER
Dean, Principal Osmania Unversity Retd.& Director, Master Key TV
9949979835

Dr. AREPALLY RAJENDER
DGM NTPC-vrs & Director, Master Key TV
9440918371

M.PADMA SARMA
SDE BSNL-Vrs & Director,Master Key TV
9440000229

GODETI GANGAIAH
Dean EX ONGC Supdt. Engineer Retd. & Sneha Privileged Member
880150660

Prof.Dr.D.M.RAVI PRASAD
Kakatiya Unversity & Director, Master Key TV
8328017720

S.RAMAKRISHNA
President,Sneha MACS
7416358036

A.GANGA RAM
Supdt.Engineer (R&B)Retd & Sneha Privileged Member
8096464691

K.K.RAJA
MD.Exotic events and promotions pvt.ltd & Sneha Privileged Member
9885281545

Dr.M.CHENNAIAH,MS
General Surgeon & Sneha Privileged Member
9440295262

Dr. CH.RAJAMOULI,MS
Ravali Nursing Home & Sneha Privileged Member
9866340952

Dr. OGURI NAGESWARA RAO
Dental Surgeon & Sneha Privileged Member
9849014562

YEMBA YELLASWAMY
Project Director, Hyderabad Metro Water Works Retd. & Sneha Privileged Member
9989990200

GOLLAPALLY DAYANAND
Sneha Privileged Member
9848019307

Dr. J B RAJU,IIS-vrs
Former News Reader, All India Radio
Managing Director, Master Key TV
9394701059

AMBASSADOR Dr. B. M. VINOD KUMAR,IFS
Director Master Key TV
7731930131

S. SAMUEL PRASAD,IRS-vrs
Sneha Privileged Member
8639148412

డా.కె శివ భాగ్యా రావు IRS-vrs
ఫౌండర్ & ఛైర్మన్

## నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



హైదరాబాద్ 18 నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి:మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నాగర్ కర్నూల్ లో పర్యటించారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం పెంట్లవెల్లి గ్రామ పంచాయతీలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య. వీరితో పాటు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రవి సీనియర్ నాయకులు తలారి కాశన్న తదితరులు విచ్చేసారు. అంబేద్కర్ భవన శంకుస్థాపన చేసిన పిదప చెన్నయ్య మాట్లాడుతూ పెంట్లవెల్లి గ్రామం లాగానే ప్రతి గ్రామంలో అంబేద్కర్ భవన్ తోపాటు అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాలను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులంతా ఐక్యమత్యంగా ఉండి బహుజనులను కలుపుకుని రాజ్యాధికారం వైపు పయనించాలి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అనుసరించిన తలారి పెద్ద కాశన్న పెట్రోల్ బంక్ యజమాని తలారి పెద్ద కాశన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య మాట్లాడుతూ డిసెంబర్ 5 నుంచి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో అన్ని గ్రామాల నుంచి మాల మాల ఉపకులాలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మాల మహానాడు నాయకులు హనుమంతు,వార్డ్ మెంబర్ కుమార్ ,ఎం.వెంకటేష్ ,బ్యాగరి రాజు ,తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన జిఎం



క్యాతనపల్లి. నవంబర్ 18. ప్రజాపాలన ప్రతినిధి :రామకృష్ణాపుర్ పట్టణంలో ని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ ని ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ప్రారంభించారు.పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ గొడిశెల సురేఖ రాజ్ గారి జ్ఞాపకార్థం డాక్టర్ రాజా రమేష్ వాటర్ ట్యాంక్ ని పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రక్త బలహీనత పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుమల,సింగరేణి ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఉష రాణి,డాక్టర్ లు వెంకటేష్,అనూష,సివిల్ ఇంజనీర్ రవి,సర్మాన్,పేరెంట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడునాయక్, గొడిసెలసుమతి, మానవతా సోషల్ వెల్ఫేర్ అధ్యక్షులు పొన్నాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మాటూరు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు



యాదాద్రి-భువనగిరి జిల్లా 18 నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి: మాటూరు గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్.నర్సింగ్ రావు. మోటకొండూరు మండలం మాటూరు గ్రామంలో బేస్తవారం నాడు ఉదయం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసిన ప్రముఖ వైద్య నిపుణులు. పేశెంటులు సందెపల్లి ముత్తయ్య, బైరపాక రమేశ్, బైరపాక నర్సయ్య (కీ.శే.గూనింటి నర్సయ్య) సతీమణి, శశికాంత్, రాధ తదితరులు ట్రీట్మెంట్ తీసుకున్నారు.

## రైతులకు మద్దతుగా మహాధర్నాలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లు నాయకులు



మేడిపల్లి, నవంబర్18 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలంగాణ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా టీఆర్ఎస్ మహాధర్నాలో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్, 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్, మరియు కార్పొరేటర్లు, తెరాస నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, మహిళా సంఘ నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారు: మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం



యాదాద్రి భువనగిరి జిల్లా 18 నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి: ధాన్యం కొనుగోలు విషయంలో రెండు పార్టీలవి రాజకీయ డ్రామాలే అన్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్.రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు పేరుతో బిజెపి- టిఆర్ఎస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సోదరీమణులు ధ్వజ మెత్తారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకో కుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నష్టపరిచే విధానాలకు పూనుకుంటున్నారని వాపోయారు. వరి ధాన్యం పేరుతో రాజకీయ కేంద్ర బిందువుగా మార్చిన పార్టీలకు రాబోవు కాలంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు అండగా ఉంటూ సమస్య తీరే వరకు పోరాట కార్యక్రమాలు చేపడుతున్న మని మహిళా కాంగ్రెస్ ఇన్చార్జి కో-ఆర్డినేటర్ మరియు యాదాద్రి- భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన ఏ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల పార్టీ అధ్యక్షురాలు అనిత మోట కొండూరు మండల పార్టీ అధ్యక్షురాలు ఝాన్సీ టౌన్ అధ్యక్షురాలు పాము అనిత తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో కదలని ఫైళ్లు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: కాళ్లు అరిగేలా తిరిగిన మోటకొండూరు మండల రెవెన్యూ కార్యాలయంలో కదలని ఫైళ్లు...మండల రెవెన్యూ కార్యాలయంలో పనులు సకాలంలో జరుగడం లేదని పలువురు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రైతు పాసు పుస్తకాల కోసం మరియు ఇతర పనులకోసం పలుమార్లు రెవెన్యూ కార్యాలయానికి తిరిగిన పని జరుగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మాటూరు గ్రామానికి చెందిన కీ.శే.తాల్క వెంకటయ్య మరణ ధృవీకరణ పత్రం గురించి ఆన్లైన్ లో అప్లై చేసి దాదాపు నాలుగు నెలలు అయినా ఇంత వరకు ధృవీకరణ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్న చిన్న పనులు కూడా రెవెన్యూ కార్యాలయంలో సకాలంలో చేయడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు కోరుకుంటున్నారు.

## పార్శపు సుశీల పార్థివ దేహాన్ని సందర్శించిన మండల టిఆర్ఎస్ నాయకుడు పంబి సాంబశివరావు



ఎర్రుపాలెం నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి:పెగళ్ళపాడు గ్రామానికి చెందిన అంగన్వాడి సెంటర్ 1 టీచర్ పార్శపు సుశీల గారు బుధవారం రాత్రి 1: 30 నిషా సమయము లో గుండెపోటు నోప్పితో చనిపోనారు. ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం ఉండాలని ఆ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని టిఆర్ఎస్ పార్టీ ఎర్రుపాలెం మండలం అధ్యక్షుడు పంభి సాంబశివరావు కుటుంబ సభ్యులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పెద్ద గోపవరం ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్ బాబు, టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దేవరకొండ చిరంజీవి, సగ్గుర్తి వెంకటరమణ, ప్రభాకర్ వేల్పుల, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల అధ్యక్ష, ఉపాధ్యక్షల ఎన్నిక



ఎర్రుపాలెం నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి:ఎర్రుపాలెం మండలంలో బుధవారం రోజున పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ యూనియన్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా శీలం రామకృష్ణారెడ్డి కార్యదర్శి సఖినవీడు, ఉపాధ్యక్షులుగా చల్లా రాజలక్ష్మి కార్యదర్శి ఇనగాలి, జనరల్ సెక్రెటరీగా పనితీ కిషోర్ కార్యదర్శి రామాపురం, కార్యవర్గ సభ్యులుగా టి రాము కార్యదర్శి గోసవీడు, జి మహేష్ కార్యదర్శి లక్ష్మీపురం, శ్రీ లక్ష్మి కార్యదర్శి ములుగుమాడు, యం తిరుపతిరావు కార్యదర్శి భీమవరం హరిజనవాడ , కోశాధికారిగా వరికూటి సురేష్ బాబు, సలహాదారుడిగా మేడ రాధాకృష్ణ మూర్తి లను ఎన్నుకోవడం జరిగింది.

## హెచ్ఐవి ఎయిడ్స్ సుఖవ్యాధులు టిబి లపై అవగాహన సదస్సు




మధిర నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి :చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సహకారంతో రాయపట్నం గ్రామములో గ్రామ పంచాయతీ నందు హెచ్ఐవి ఎయిడ్స్ సుఖవ్యాధులు టిబి లపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా లింక్ వర్కర్స్ సూపర్వైజర్ డి నిరోష గారు మాట్లాడుతూ హెచ్ఐవి అనేది రాయపట్నం గ్రామంలో చాపకింద నీరులా ప్రబలుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకోవాలని సూచించారు. సుఖవ్యాధులు టిబి లపై అవగాహన కల్పించారు ఆడవారిలో మగవారిలో లక్షణాలు నివారణ సేవలు ఉచిత వైద్యం మందులు వాడే విధానం గురించి తెలియజేశారు, హెచ్ఐవి సోకిన వారికి ప్రభుత్వం ప్రతి నెల 2016 రూపాయల పింఛను కూడా వస్తుందని తెలియజేశారు, గ్రామ సర్పంచ్ నడ్రు సుశీల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత, పాటించాలి అని. రాబోయే రోజుల్లో రాయపట్నం గ్రామంలో హెచ్ఐవి రహిత గ్రామంగా తీర్చిదిద్దుకునేందుకుమా వంతు సహకారంతప్పనిసగాఉంటుందిఅనితెలియజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నడ్రు సుశీల, కార్యదర్శి సునీత,లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ నిరోషా , లింక్ వర్కర్ సుశీల , అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి,పద్మఆశ వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానా లో దాతలు సహకారం మల్లాది వాసు దంపతులు అన్నదానం



మధిర నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి మధిర లడక బజార్ నందు కొలువై ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దర్శనార్థం విచ్చేసిన అయ్యప్ప మాలధారులు అనంతరం శుక్రవారం ఉదయాస్తమాన పూజ కార్యక్రమాన్ని కుటుంబ సమేతంగా నిర్వహించిన మల్లాది వాసు అనంతరం ఈరోజు మాల దారులకు అన్నదాన కార్యక్రమాన్ని మల్లాది వాసు వారి కుటుంబ సభ్యులు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మల్లాది వాసు మాట్లాడుతూ స్వామి అయ్యప్ప దేవాలయంలో కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా అన్నదానం చేయడం అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానం చేయటం ఎంతో స్వాములకు అన్నదానం చేయటం ఎంతో ఆనందం అని తెలిపారు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు దేవస్థానం కమిటీ వారికి స్వాములకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలోశ్రీనివాసరావు వంకాయలపాటి నాగేశ్వర్ రావు శ్రీనివాస రావు చలవాది మురళి జగన్మోహన్ రావు తదితరులు అయ్యప్పలు పాల్గొన్నారు

# దేశంలో జెండా లేవాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)



దేశంలో జెండా లేవాల్సిందే. మరో పోరాటానికి సిద్ధం కావాలి. దేశ ప్రజలు బిచ్చగాళ్లు కాదు. ఇంత అరాచకంగా కేంద్రం పాలిస్తుందా? రెండు చేతులు జోడించి మోడీని వేడుకుంటున్నా.. వరి వేయాలా? వద్దా? చెప్పాలి. రెండు మూడు రోజులు వేచి చూస్తాం. కేసులకు భయపడేది లేదు. అవసరం అయితే గ్రామాల్లో చావు డప్పు కొడదాం. రాజకీయాలు పక్కన పెడితే టీఆర్ఎస్?లా రణం చేసే పార్టీ దేశంలో లేదు' అని సీఎం కేసీఆర్ అన్నారు.

## తిరుపతిలో చిక్కుకున్న భక్తులకు వసతి

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్న భక్తులు తిరుపతి లోని శ్రీనివాసం, మాధవం, రెండు, మూడో సత్రాల్లో వసతి ఏర్పాటు చేశారు.మరోవైపు .. వర్షం కారణంగా శ్రీవారి దర్శనానికి రాలేని భక్తులుకు ఉపశమనం కలిగించింది ఇవాళ,రేపు,ఎల్లుండి దర్శన టిక్కెట్లు కలిగి రాలేని భక్తులు..తర్వాత రోజులలో శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని ఈఓ జవహర్ రెడ్డి తెలిపారు.

## బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

దగ్గర రుణం తీసుకుని ఎగ్గొట్టి పారిపోయేవాళ్లు ఉన్నారని.. దాని గురించి అందరూ చర్చిస్తారని, కానీ ఓ ప్రభుత్వం చాలా సాహసం చేసి ఆ రుణఎగవేత దారులను పట్టుకువస్తోందన్నారు.. దాని గురించి ఎవరూ చర్చించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వాల సమయంలో స్తంభించిపోయిన లక్షల కోట్ల రూపాయాల్లో తమ ప్రభుత్వం 5లక్షల కోట్లకు పైగా రికవరీ చేసినట్లు ప్రధాని మోడీ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రం వచ్చాక.. రాజకీయాలు దిగజారాయి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ రామస్వామి గొప్ప మహనీయుడని, ఆయన ప్రజలకు అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. రామస్వామి, నాగిని నరసింహారెడ్డి బుల్లెట్ పైన వచ్చే వాళ్లు అసెంబ్లీకి వచ్చేటోళ్లని, మరికొందరైతే ఆటోలలో వచ్చేవాళ్లని గుర్తు చేసుకున్నారు. ఇప్పటికీ గుమ్మడి నర్సయ్య పూరి ఇంట్లో ఉంటాడని వివరించారు. అయితే నీతి నిజాయితీ విలువలతో కూడుకున్న రాజకీయ నేతలను కేసీఆర్ ఇబ్బందులు పెడుతున్నడని ఈటల రాజేందర్ ఆరోపించారు.

**హుజూరాబాద్ ఎన్నికల్లో టీఆర్ఎస్ 600 కోట్లు ఖర్చు పెట్టింది**

ఒక్క హుజురాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 600 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందని, దేశంలోనే ఇంత డబ్బు ఖర్చు పెట్టిన ఎలక్షన్ ఎక్కడా లేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ డబ్బు సంచులకు, మద్యానికి హుజురాబాద్ ప్రజలు లొంగకుండా కేసీఆర్ చెంప ఛెళ్లు మనిపించారని ఈటల అన్నారు. హైదరాబాద్ ప్రజలు ధర్మం, న్యాయం, వైపు ఉండి నీతి నిజాయితీ రాజకీయాలు చేసే నేతలను ఎన్నుకోవాలని ఆయన కోరారు.

## ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు అడ్డగోలుగా వాహనాలు



ఎర్రుపాలెం నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి: ఎర్రుపాలెం మండలంలోని రింగ్ సెంటర్ నందు అడ్డగోలుగా వాహనాలు నిలిపివేస్తున్నారు. రోడ్ల మీద పెండ దెబ్బలు, గేదెలు ఉండటం వలన గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు కూడా ఎక్కడపడితే అక్కడ రోడ్డుమీద నిలిపివేస్తున్నారు. రాత్రిపూట వాహనదారులు రోడ్డు మీద వాహనాలు కనపడక పోవటంతో ఎన్నో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు చూస్తూ ఉన్నారు తప్ప స్పందన కలిగించడం లేదు. పండ్ల వ్యాపారులు కూడా రోడ్ల మీదే పండ్లు పెట్టి పండ్లు అమ్ముతున్నారు. రాత్రిపూట వాహనదారులకు చాలా ఇబ్బంది ఎదురవుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి రింగు సెంటర్ దగ్గర ఉన్న పండ్ల దుకాణాలు తొలగించాలని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ కదం తొక్కిన కర్షకులు



మేడిపల్లి, నవంబర్18 (ప్రజాపాలన ప్రతినిధి) :వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ కర్షకుడా రా..! కదలి రా.. అనే నినాదంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. నగరంలో పబ్లిక్ గార్డెన్ నుంచి వ్యవసాయ శాఖ కమిషనరేట్ వరకు గురువారం చేపట్టిన కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కదం తొక్కారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముళ్ళ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో బోరంపేట కృష్ణ, తవిడబోయిన గిరిబాబు ,జలీల్ పశ ,డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్ ,ప్రకాష్ రెడ్డి,కొంపల్లి బాలరాజ్, సుధాకర్ ,అలీం ,సల్ల ప్రభాకర్ రెడ్డి,తుమ్మల దేవి రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, మంద మురళీ కృష్ణ, రెడ్డి,అలుగుల అనీల్ కుమార్,సుంకు శేఖర్ రెడ్డి, వర్కల మధన్ గౌడ్, అల్వాల భాస్కర్,జనగాం రామకృష్ణ,నవీన్ యాదవ్, గోవింద్ కుమార్, రఘు గుప్తా,సుమన్ రెడ్డి, హనుమంతు, అస్లాం భాయ్, గోరిగే మహేష్, రాంరెడ్డి, పీటర్,సందీప్,భాస్కర్, జిత్తు రెడ్డి, పాలడుగు లక్ష్మణ్,కన్నమైన నరేశ్, తీగ గిరి ,ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి,బచ్చా రాం, శివ ప్రశాంత్ రెడ్డి,రాం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలలో ఖాళీలను భర్తీ చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య




వికారాబాద్ బ్యూరో 18 నవంబర్ ప్రజాపాలన : జిల్లాలోని సంక్షేమ శాఖల వసతి గృహాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యస్సి, యస్టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల వసతి గృహాల నిర్వహణ, ఉపకార వేతనాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ, వసతి గృహాలలో గతం కన్న ప్రస్తుతం విద్యార్థులకు మంచి వసతి, భోజనంతో పాటు విద్యను అందించడం జరుగుతుం దన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల భవిష్యత్తు బాగుపడాలం టే సంక్షేమ వసతి గృహాల అధికారులు చురుకుగా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాలకు కార్పొరేట్ స్థాయిలో కొత్త భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. నిరుపేద విద్యార్థులకు వసతితో పాటు మంచి భోజనం, బట్టలు, దుప్పట్లు, కాస్మోటిక్స్ తో పాటు స్కాలర్ షిప్పులు, మంచి విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చి దిద్దుతుందన్నారు. కోవిడ్ కారణంగా వసతి గృహాలలో ఏర్పడిన ఖాళీలను పూర్తి చేసేందుకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తమ పరిధిలో గల పాఠశాలల్లోని ప్రధాన ఉపాధ్యాయులను సంప్రదించి వారి వివరాలను సేకరించాలన్నారు. అట్టి విద్యార్థులు తల్లితండ్రులను సంప్రదించి మోటివేట్ చేసి అధిక సంఖ్యలో పిల్లలను వసతి గృహాలలో చేర్పుంచాలని సూచించారు. వసతి గృహంలో ఉన్న ప్రతి విద్యార్థి బాగోగులను తల్లి తండ్రులవలే వసతి గృహ అధికారులు చూసుకోవాలని, వారి విద్యా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆరోగ్య చికిత్సలు నిర్వహించాలని తెలిపారు. కోవిడ్ కారణంగా గత సంవత్సరం నర కాలం నుండి దూరమైన విద్యార్థులందరిని తిరిగి చేర్పించాలన్నారు. వసతి గృహాలలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అందరికి మాస్కులు, శానిటైజర్లు అందించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ ల క్రింద బాలురకు రూ. 1000/- బాలికలకు రూ. 1500/- లు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి బ్యాంకులలో ఖతలు తెరిపించాలని సూచించారు. ప్రతి వసతి గృహంలో మిషన్ భగీరథ మంచి నీటి సదుపాయం కల్పించడం జరిగిందని, ఇతర సదుపాయాలు ఏమైనా లేనట్లయితే ప్రతిపాదనలు పంపాలని, పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురుగు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చెపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్సి, యస్టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు మల్లేశం, కోటాజి, పుష్పలత, సుధారాణి, %యూజుఔ×ణజ ణజు% రాజు లతో పాటు అన్ని సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, %ఎవీ% లు, ప్రిన్సిపాల్లు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయము అందజేత



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17 ప్రజాపాలన ప్రతినిధి :ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం శేరిగూడ పరిధిలో ఇటీవల మరణించిన రైతులకు ఆర్థిక సహాయం అందజేసిన సహకార సంఘం పాలకవర్గం,మరియు బ్యాంక్ సీఈవో గణేష్. మరణించిన వారు దూస పోచమ్మ భర్త బాలయ్య, ఏన్ను సుదర్శన్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి పాలకవర్గం చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు చెరో 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి పాలక వర్గసభ్యులు క్యామ శంకరయ్య , ఏదుళ పాండురంగా రెడ్డి , ఏదుళ్ల బంగా రెడ్డి, బొమ్మకంటి అశోక్, సుబ్బురి జంగయ్య , మేడిపల్లి పుల్లయ్య గుర్రం సుధాకర్ రెడ్డి , పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , శ్రీమతి నల్లోల పోచమ్మ , శ్యారింగ్ విశాల శ్రీనివాస్ రెడ్డి గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు చెయ్యాలని డిమాండ్




ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి గురువారం రోజు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పిలుపుమేరకు తెలంగాణ రైతులు పండించిన వరీ ధాన్యం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి లని డిమాండ్ చేశారు ఇందిరా పార్క్ వద్ద జరిగే టీఆర్ఎస్ మహా ధర్నా కార్యక్రమానికి రైతులుకు మద్దతుగా పాల్గొన్న టిఆర్ఎస్వి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్. ఏర్పుల చంద్రయ్య తదతరులు పాల్గొన్నారు.

## బాలున్ని తల్లిదండ్రుల వద్దకు చేర్చండి: వికారాబాద్ సిఐ రాజశేఖర్



వికారాబాద్ బ్యూరో 18 నవంబర్ ప్రజాపాలన : వికారాబాద్ రైల్వేస్టేషన్ లో తప్పిపోయిన బాలుడు హర్షిత్ రెడ్డి (4) ని తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని పట్టణ సిఐ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 18 నవంబర్ 2021 గురువారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు వికారాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం1 లో తిరుగుతున్న నాలుగు సంవత్సరాల బాలున్ని ఆర్పిఎఫ్ ఏఎస్ఐ కిష్టయ్య గుర్తించాడన్నారు. వెంటనే స్పందించి చైల్డ్ లైన్ 1098 సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. చైల్డ్ లైన్ కౌన్సిలర్ రామేశ్వర్ వెళ్లి బాలుడిని కౌన్సిలింగ్ చేయగా బాలుడి పేరు హర్షిత్ రెడ్డి, తండ్రి సంతోష్, తల్లి లావణ్య, గ్రామం కాంచనెల్లిగా తెలిపారని వివరించారు. సిడబ్ల్యుసి అనుమతితో శిశు గృహ వికారాబాద్ లో అడ్మిషన్ చేశారని స్పష్టం చేశారు. ఫోటోలో ఉన్న బాలుడిని గుర్తించినవారు వికారాబాద్ సిఐ 9440627354 లేదా చైల్డ్ లైన్ 1098 లకు సమచారం ఇవ్వగలరాని వికారాబాద్ సిఐ రాజశేఖర్ కోరారు. బాలుడు తెలుగు, కన్నడ భాషలలో మాట్లాడుతున్నాడని చెప్పారు. తండ్రీ కార్ డ్రైవర్ గా పనిచేస్తునాడు.

## కార్మికుల సమస్యలు పరిష్కారించాలి: ఏ.ఐ.టీ.యు.సీ



నవంబర్18. క్యాత నపల్లి. ప్రజాపాలన ప్రతినిధి : ఆర్కే వన్ ఎ. గని ఆవరణలో, ఎస్ సి. డబ్ల్యు. యు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలనీ ఎం డి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాజమాన్యం ఏదేతే సర్ పేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్ లు ఇస్తాన ని అంటుందో ఆ ప్రమోషన్ లు ఎలాంటి షరతులు లేకుండా అనారోగ్యంతో బాధ పడుతున్న కార్మికుల అందరికీ అవకాశం కల్పించాలని కొంత కాలంగా యాజమాన్యం అవసరాలకు అనారోగ్యం కారణాల వల్ల సర్ ఫేస్ లో ని అన్ని డిపార్ట్మెంట్ లలో డిప్యుటేషన్ లో పని చేస్తున్న కార్మికులకు సర్ ఫేస్ లో ప్రాధాన్యత కల్పించి సర్ ఫేస్ జనరల్ మజ్దూర్ ఇవ్వాలని, అలాగే ఏయే క్యాటగిరి లలో యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు, ఆయా క్యాటగిరి ల ప్రమోషన్ కల్పించాలి అని అన్నారు. ఆర్కే వన్. ఎ. గని జీవిత కాలం, నిక్షేపాలు ఉన్నంత కాలం కొనసాగించాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ వయస్సు పెరిగిన కార్మికులకు ఇంటి అద్దె ఎలాంటి షరతులు లేకుండా యాజమాన్యం చెల్లించాలని ఆర్కే. వన్. ఎ గని యాజమాన్యం, కార్మికులపై అధిక పని భారం మోపుతున్నదని, ఇకనైనా కార్మికులపై పని భారం తగ్గించాలని, లేని పక్షం లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. గుర్తింపు సంఘం టీ.బీ.జీ.కేఎస్ నాయకులు,వారి మాట వినని వారిని వేరే యూనియన్ కండువాలు వేసుకున్న కార్మిక సోదరులను కక్ష కట్టి,అక్రమ బదిలీ ల పేరుతో వేదిస్తున్నారని, గతంలో కేవలం కార్మికులను మాత్రమే బెదిరించే వారని, ఇప్పుడు అధికారులను కూడా బెదిరిస్తున్నారని, టి. బి. జి. కె.స్. నాయకులు చెప్పినట్టు చేయక పోతే ఇతర యూనియన్ ల రంగు పూసి, ప్రాంతీయ తత్వంను రెచ్చగొట్టి, యాజమాన్యం విధానం కు వ్యతిరేకంగా బదిలీలు చేస్తున్నారని, మందమర్రి ఏరియాలో పని చేస్తున్న స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్ బదిలీ చేయడం జరిగింది. అలాంటి అరాచకం విధానం వల్ల పారిశ్రామీక అశాంతి నెలకొంటుందని వెంటనే ఆ సూపర్ వైజర్ బదిలీ ని రద్దు చేసి మందమర్రి ఏరియాలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఇలా చేయడం కార్మికుల చట్టాలకు వ్యతిరేకం అని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం టి. బి. జి. కె. స్. నాయకులు చెప్పినట్టు చేయకుండా చట్ట ప్రకారం పని చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్కే వన్. ఎ గని ఎస్. సి. డబ్ల్యు.యు ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్ కుమార్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గోవిందుల రమేష్,, ఆర్కే వన్ ఎ గని ఫిట్ వైస్ ప్రెసిడెంట్ గాజుల రాయమల్లు, కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య, బాల్ కోటి రెడ్డి, మారం రాజు,చంద్రకాని రమేష్,సిద్ధం హరి కృష్ణ ,కోమటిపెల్లి సత్తయ్య, శ్రీహరి,కారపాకుల లక్ష్మయ్య,బొంకురి సురేష్, గోత్త గిరి ప్రసాద్,దుగుట హనుమయ్య,ఏఐటీయూసీ కార్యకర్తలు మరియు కార్మిక సోదరులు పాల్గొన్నారు..

## చిక్కుడు గుండాలును సన్మానించిన గ్రామ ప్రజలు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలం గురువారం మన కొత్తపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ జగన్ ఎంపీటీసీ సుమతమ్మ లోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో మన గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కుడు గుండాలు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆఫ్ జర్మన్ ద్వారా డాక్టరేట్ పొందిన సందర్భంగా పూలమాలవేసి శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీనివాస్ గౌడ్, రమేష్, భాగ్యమ్మ, మరియు ఎండి రని, కావలి బాలయ్య, నాగిళ్ల వెంకటయ్య, ఎండి లతీఫ్, వరికుప్పల శేఖర్, పగడాల అశోక్, నోముల మొగులయ్య, బూడిద మల్లయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ పేటెంట్ ప్రాసిక్యూషన్ పై వెబినార్



కొడిమ్యాల, నవంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి): కొడిమ్యాల మండలజెయన్టియు ఇంజనీరింగ్ కళాశాల నాచుపల్లి లో అన్ని విభాగాల విద్యార్థులకు ఒక రోజు వెబినార్ బుధవారం నిర్వహిచడం జరిగింది. దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ ప్రొ? వి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ పేటెంట్ ప్రాసిక్యూషన్ ఏ విధంగా విద్యార్థులకు దోహదపడుతుందో వివరించారు. రిసోర్స్ పర్సన్ డా? రాజేష్ కులకర్ణి ఐపిఆర్ అండ్ పిపి గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొ? టి.వేణుగోపాల్ ఐపిఆర్ సెల్ కోఆర్డినేటర్ ప్రొ.ఎం యం.ధనలక్ష్మీ , రీసెర్చ్ అండ్ అకాడమిక్స్ కోఆర్డినేటర్ డా?బి. క్రాంతి కిరణ్ మరియు వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## కంప చెట్లతో కానరాని మాటూరు పంచాయతీ రాజ్ రోడ్డు



యాదాద్రి-భువనగిరి జిల్లా 18 నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి: పంచాయతీ రాజ్ శాఖ వర్టూరు నుండి అమ్మనబోలు వయా మాటూరు వెల్లే దారి అధ్వాన్నంగా తయారైంది. హైదరాబాద్ నుండి అమ్మనబోలు వయా మాటూరు గ్రామానికి అతి పురాతన మైనది మరియు ఇది మొదటి రోడ్డు. వాహనాల రాక పోకలకు ఇబ్బంది కరంగా ఉందంటున్నారు. ప్రభుత్వ బస్సు నడవడానికి కూడా అసౌకర్యంగా ఉందని బస్సు డ్రైవర్ లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గుంతల మయం అయిన రోడ్డు లో బస్ లు నడపడం కష్టం గా ఉందని రవాణా శాఖ డ్రైవర్లు వాపోతున్నారు. ఇంతేకాకుండా మాటూరు చెరువు గండి నుండి శిద్దెంగుల గడ్డ వరకు గల పంచాయతీ రాజ్ శాఖ రోడ్డు మొత్తం కంప చెట్లతో మూసుకొని పోయింది. వాహనాలు కాదు కదా కనీసం మనుషులు కూడా నడవడానికి వీలు లేకుండా ఇరు పక్కల కంప చెట్లతో రోడ్డు మూసుకొని పోయింది. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు నాయకులు కోరారు. మాటూరు చెరువు గండి నుండి శిద్దెంగుల గడ్డ వరకు గల పంచాయతీ రాజ్ రోడ్డు మీద ఉన్న కంప చెట్లను వెంటనే ఉపాధి హామీ పథకం కింద కంప చెట్లను తొలగించాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు.

## కుల సంఘాల భవన నిర్మాణానికి చెక్కుల పంపిణీ



కోరుట్ల, నవంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) :కోరుట్ల మండలంలోని జొగన్ పల్లి గ్రామాల్లో డీఎంఎఫ్టీ నిధుల నుండి కోరుట్ల నియోజక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు రెడ్డీస్ సంఘానికి 3,10,000/- ,గంగపుత్ర సంఘానికి 3,15,000/- లు మంజూరు చేయించారు. బుధవారం రోజున సర్పంచ్ దుంపల నర్సు రాజ నర్సయ్య కుల సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుంపల నర్సు రాజ నర్సయ్య మాట్లాడుతూ కుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుల సంఘాల నిధులు మంజూరు పట్ల రెడ్డీస్,గంగాపుత్ర సంఘ సభ్యులు హర్షం వ్యక్త%శీ% చేస్తూ,ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకి,గ్రామ సర్పంచ్ దుంపల నర్సు రాజ నర్సయ్యకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ బద్ధం తిరుపతి రెడ్డి, వార్డ్ సభ్యులు బద్ధం రాజేశం, పల్లికొండ రమేష్, పల్లికోండ నర్సయ్య, సంఘ సభ్యులు బుచ్చిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,భూమా రెడ్డి,తోకల నర్సయ్య,స్వామి ,శేఖర్ , సంఘ సభ్యులు ,తదిధరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రలో నిబంధనలు పాటించాలి: డిఎస్పీ ప్రసాద్

కావలి, నవంబర్ 18, ప్రజాపాలన ప్రతినిధి: మహా పాదయాత్ర లో హైకోర్టు నిబంధనలు పాటించాలని డి.ఎస్.పి ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్ తరఫున రైతుల రక్షణ మా బాధ్యత అని పాదయాత్రలో కోర్టు గుర్తింపు పొందిన రైతులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. -ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డిఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఎస్సైలు 12 మంది, మొత్తం 142 మంది సిబ్బందితో బందోబస్తు ఉంటుందని తెలియజేశారు. స్వాగతాలు పలకడం, టపాసులు కాల్చడం నిషేధం. కార్యక్రమం మొత్తం వీడియో తీసి హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. రైతులు దారిలో ప్రెస్ మీట్ నిర్వహించరాదని ఎక్కడైనా ఆగినప్పుడు మాత్రమే నిర్వహించుకోవాలని చెప్పారు. బయటి వ్యక్తులు, పార్టీల వారు ఈ పాదయాత్రలో పాల్గొనరాదని నిబంధనలు ఉల్లంగిస్తే కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సి ఐ లు శ్రీనివాస్ రావు, ఖాజావలి మల్లికార్జున, ఎస్ఐలు పాల్గొన్నారు.




కావలెను

అప్రతిహతంగా దూసుకుపోతున్న మాస్టర్ కి టీవీ ఛానల్లో అసెంబ్లీ వారీగా పనిచేయుటకు రిపోర్టర్స్ కావలెను

ఈ క్రింది అసెంబ్లీలో పనిచేయుటకు రిపోర్టర్స్ కావలెను

- హైదరాబాద్
- మలక్పేట్
- చార్మినార్
- యాకుత్ పుర
- చంద్రయాన్ గుట్ట
- కార్వన్
- గోషమహల్
- బహదూర్పుర
- సిక్రిందాబాద్
- అంబర్పేట్
- నాంపల్లి
- ముషీరాబాద్

Contact No: 8886911944
8886090484

ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 19, నవంబరు 2021

## పోటాపోటీ పెద్దన్నలు!

ఒకరు అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు బైడెన్... మరొకరు అగ్రస్థానానికి దూసుకువస్తున్న చైనా దేశాధినేత షీ జిన్‌పింగ్. ప్రపంచాన్ని శాసించే విషయంలో నువ్వా నేనా అంటూ పోటీపడుతున్న ఈ రెండు దేశాల అధినేతలూ కలసి మాట్లాడుకొంటే, అంతకన్నా పెద్ద వార్త ఏముంటుంది? వీడియో కాన్ఫరెన్స్‌లో అయితేనేం, సోమవారం నాటి ఈ అగ్రజుల భేటీ మీద అందరి దృష్టీ పడింది అందుకే! కానీ, చైనాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్న అమెరికా... తైవాన్ అంశంలో అమెరికా వేలు దూర్చాలనుకోవడం నిప్పుతో చెలగాటమని హెచ్చరించిన చైనా... ఇలాంటివే పతాక శీర్షికలకు ఎక్కాయి. అంటే, మూడున్నర గంటలు సాగిన ఈ భేటీ నిజంగా సాధించినదేమిటని అనుమానం రాక మానదు. రెండు దేశాల మధ్య అనేక విభేదాలున్నాయనీ, పోటీ తప్పదనీ మినహా ఈ చర్చల్లో తేలిన విషయం, చెప్పుకోదగ్గ విజయం ఏమిటన్నది విశ్లేషకులను వేధిస్తున్న ప్రశ్న. ఈ స్థాయి చర్చలు ముగిశాక సాంప్రదాయిక సంయుక్త ప్రకటనైనా వెలువడకపోవడం గమనార్హం. ఇద్దరు నేతలూ ఈ ఏడాది రెండుసార్లు ఫోన్లలో మాట్లాడుకున్నా, ఈ వీడియో భేటీ అనేక అంశాలపై లోతైన చర్చకు తావిస్తుందని అందరూ ఆశించారు. కానీ, 'ఈ భేటీతో మేమేమీ అద్భుతాలు ఆశించలేదు. అదే జరిగింది' అని తేల్చేశారో అమెరికన్ అధికారి. అయితే, నికర విలువ పరంగా, అమెరికాను దాటుకొని, ప్రపంచంలోనే ధనిక దేశంగా నంబర్ వన్ స్థానానికి చైనా ఎగబాకిందని తాజా మెకిన్సే నివేదిక తేల్చింది. ఆ పురోగతికి తగ్గట్టే, వాషింగ్టన్‌కు సమవుజ్జీ తామేనని బీజింగ్ భావిస్తున్నట్టు చర్చల్లో ఆ దేశాధ్యక్షుడి వైఖరి చెప్పకనే చెప్పింది. మానవ హక్కుల గురించి, ఉపఖండంలో దూకుడు గురించి అమెరికా సుద్దులు చెబితే చైనా డూడూ బసవన్నలా తల ఊపే పరిస్థితి కనపడలేదు. పైపెచ్చు, తాము అంతర్భాగమని భావించే తైవాన్ స్వాతంత్ర్యంపై జోక్యం చేసుకుంటే తస్మాత్ జాగ్రత్త అని చైనా మాటకు మాట అప్పగించింది. ఆత్మవిశ్వాసంతో, నిక్కచ్చిగా మాట్లాడుతున్న చైనా మాటలను అమెరికా సావధానంగా వినక తప్పలేదు. అంతే కాదు... 'మేము ప్రధాన ప్రపంచ లీడర్. అలాగే మీరు కూడా' అని చైనాతో అమెరికా అంటే అది సహజం. కానీ ఈ భేటీలో బైడెన్, షీని ఉద్దేశించి, 'మీరు (చైనా) ప్రధాన ప్రపంచ లీడర్. అలాగే అమెరికా కూడా' అంటూ, చైనాకు పెద్ద పీట వేసి మాట్లాడడం మారిన పరిస్థితులకు ప్రత్యక్ష నిదర్శనం. చైనా జోరుకు బ్రేకులు పడేలా, భావసారూప్యం ఉన్న ప్రజాస్వామ్య దేశాలతో కలసి 'క్వాడ్' సహా రకరకాల పేర్లతో జట్టు కట్టడం అమెరికా వ్యూహం. ఈ వ్యూహాన్ని చైనా పరోక్షంగా ప్రస్తావించింది. శిబిరాల ఏర్పాటు వల్ల ప్రపంచానికి మళ్ళీ ప్రచ్ఛన్న యుద్ధం నాటి ఉత్పాతం తప్ప ఒరిగేదేమీ లేదన్న షీ జిన్‌పింగ్ వ్యాఖ్య తీవ్రమైనదే. బైడెన్ సైతం షింజియాంగ్, టిబెట్, హాంగ్‌కాంగ్‌లలో చైనా అనుసరిస్తున్న విధానాలు, మానవ హక్కుల ఉల్లంఘన వార్తల లాంటి ఘాటైన అంశాలను నిర్మొహమాటంగా షీతో ప్రస్తావించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత సముద్రయాన ప్రాధాన్యం గురించి లేవనెత్తారు. అదే సమయంలో పరస్పరం పోటీపడినప్పటికీ, ఘర్షణకు దిగకుండా, పర్యావరణ మార్పు లాంటి ఉమ్మడి ప్రయోజనాలున్న కీలక అంతర్జాతీయ అంశాల్లో కలసి పనిచేయాలంటూ అమెరికా అనడం ఆహ్వానించదగినది. ప్రపంచ శాంతి సౌభాగ్యాల కోసం అంతర్జాతీయ బాధ్యతలలో ఇరుదేశాలూ భుజం కలపాలని చైనా అధినేత సైతం అంగీకరించారు. కానీ, వాస్తవంగా వాటి గురించి ఈ భేటీలో ఎంత చర్చ జరిగిందంటే, మళ్ళీ ప్రశ్నార్థకమే. ఇటీవలే ముగిసిన ప్రపంచ పర్యావరణ సదస్సు 'కాప్-26' సైతం పర్యావరణ పరిరక్షణకు అగ్రరాజ్యాలు చేయాల్సిన త్యాగాలను కుండబద్దలు కొట్టింది. ఆ సదస్సులో ఇరుదేశాల ప్రతినిధులూ ఒప్పందం కుదుర్చుకున్నా, ఇప్పుడీ భేటీలో అంతకు మించిన ఆచరణాత్మక ప్రణాళికను ప్రకటించే చొరవ దేశాధ్యక్షులు తీసుకోలేదు. కానీ పనిలో పనిగా అనేక అంశాల్లో చైనా తనను తాను సమర్థించుకుంది. భారత్‌తో వాస్తవాధీన రేఖ వెంట, జపాన్‌తో సముద్రజలాలపైన చైనా ప్రదర్శిస్తున్న దూకుడుపై వస్తున్న విమర్శలను తగ్గించే ప్రయత్నం చేసింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆవిర్భావం నుంచి ఇప్పటి దాకా చైనా తనకు తానుగా ఏ యుద్ధాన్నీ మొదలుపెట్టలేదనీ, ఇతర దేశాల నుంచి అంగుళమైనా ఆక్రమించలేదనీ, దురాక్రమణ - ఆధిపత్యం తమ రక్తంలోనే లేవనీ నాణేనికి ఒక వైపునే చూపెట్టింది. ప్రజాస్వామ్యమనేది ఏకరూప నమూనాలో ఉండదనీ, తమదైన పద్ధతిలో లేవని ఆ ప్రజాస్వామ్యాలను కొట్టిపారేస్తే అది అప్రజాస్వామికమనీ అమెరికాకు పాఠాలూ చెప్పింది. ట్రంప్ కాలం నుంచి ఇరుదేశాలూ వాణిజ్య, సాంకేతిక పోటీ విషయంలో వాదులాడుకుంటున్నాయి. అలాగని సరఫరా వ్యవస్థల కొరత, ద్రవ్యోల్బణం, ట్యారిఫ్‌లను తగ్గించే అవకాశం లాంటి ఆర్థిక అంశాలేవీ తాజా భేటీలో చర్చించినట్టు లేరు. ఇకపై జరిగే వాణిజ్య చర్చల్లో చైనా పట్ల అమెరికా కొంత మెత్తబడేందుకు ఈ పెద్దల వర్చ్యువల్ భేటీ దారులు వేస్తుందని చైనా విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, 'పోటీ ఓకే కానీ, పోరాటం వద్దు. పర్యవసానంగా సంబంధాలు చెడగొట్టుకోవద్దు' అన్నదే ఈ పెద్దన్నల మాటల్లో తేలిన విషయం. ఈ మార్చిలో అలాస్కాలో రెండు దేశాల సీనియర్ అధికారుల మధ్య రెండు రోజుల పాటు మూడు రౌండ్ల చర్చల వేళ నిందారోపణలు బయటపడితే, ఈసారి స్వరం మారడం కొంత శుభసూచకం. విభేదాలున్నా, అవి విపరీత ఘర్షణకు దారితీయకూడదన్న వివేకం ప్రపంచానికి మంచిదే! ఇటుపై దీన్ని ఎలా ముందుకు తీసుకెళతారో చూడాలి.

# ఆ 'అధికరణం' ఇక్కడ రద్దయిందా?




ఒక పుస్తకావిష్కరణ సభ ముందు రోజు ఆ పుస్తకం అచ్చయిన ప్రింటింగ్ ప్రెస్ మీద దాడి చేసి ఆ పుస్తకాలన్నీ జప్తు చేయడం, ప్రింటింగ్ ప్రెస్ యజమానుల మీద కేసు నమోదు చేయడం, సభ జరగవలసి ఉండిన హాలు యాజమాన్యం మీద ఒత్తిడి తెచ్చి సభ జరగకుండా చూడడం, సభకు అనుమతి లేదని చెప్పడం పైకి చూడడానికి పోలీసు చర్యలు, ఒకానొక ప్రభుత్వ శాఖ చర్యలు కావచ్చు. లేదా, పాలకుల ప్రత్యక్ష, పరోక్ష ఆదేశాలు కావచ్చు. కాని ఆధునిక ప్రజాస్వామిక పాలన అని చెప్పుకునే చోట, ఒకానొక ప్రభుత్వ శాఖో, పాలకులో తీసుకునే చర్య ఏదైనా ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, చట్టబద్ధ పాలనకు లోబడి ఉండాలి. ఆ పనులన్నీ శాంతిభద్రతల కోసమే చేశామనే కారణం చెప్పినా, అవి సందేహానికి తావు లేని విధంగా ప్రజాస్వామిక సంప్రదాయాల ప్రకారమే, చట్టం నిర్దేశించిన పద్ధతి ప్రకారమే జరిగేట్టు చూడవలసిన, చూపుకోవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. కాని నవంబర్ 12న హైదరాబాద్‌లో నవ్య ప్రింటర్స్ మీద జరిగిన దాడి, 'సాయుధ శాంతి స్వప్నం' అనే పుస్తకం అచ్చయిన, అచ్చవుతున్న కాపీల జప్తు, ప్రెస్ కంప్యూటర్లలోని హార్డ్ డిస్కులు జప్తు చేసి ఆ ప్రెస్ వ్యాపారానికి ఆటంకాలు సృష్టించడం, ప్రెస్ యజమాని మీద, ఆయన భార్య మీద తెలంగాణ ప్రజా భద్రతా చట్టం కింద కేసు పెట్టడం, నవంబర్ 14న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగవలసిన పుస్తకావిష్కరణను అనుమతించడం లేదని నిర్వాహకులకు చెప్పడం, జరగనివ్వవద్దని హాలు యాజమాన్యం మీద ఒత్తిడి తేవడం మొదలైన చర్యలన్నీ స్పష్టంగా రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలే. ఇది కేవలం ఆ పుస్తక ప్రచురణకర్తలకో, ప్రింటింగ్ ప్రెస్‌కో మాత్రమే సంబంధించిన విషయం కాదు. ఈ పనులు చేసిన తెలంగాణ పోలీసు శాఖ, అందుకుగాను ఆ శాఖను ఆదేశించిన ప్రభుత్వం చట్టబద్ధ, ప్రజాస్వామిక పాలన నిర్వహించదలచుకున్నాయా లేదా, తెలంగాణలో రాజ్యాంగ అధికరణం 19 (1)లో హామీ ఇచ్చిన 'భావప్రకటనా స్వేచ్ఛ', 'నిరాయుధంగా సమావేశమయ్యే స్వేచ్ఛ', 'ఇష్టం వచ్చిన వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ'లు అమలవుతున్నాయా లేదా అనే విశాలమైన ప్రశ్నలకు సంబంధించినవి. అంటే మొత్తంగా సమాజ జీవనానికి, ప్రజాస్వామ్యానికి సంబంధించినవి. ఇక్కడ రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన మూడు అంశాలున్నాయి. అవి ఒకటి, ఒక పుస్తకాన్ని, రచనను విడుదల కాకముందే అడ్డుకోవడం. రెండు, ఒక సమావేశాన్ని, అందులోనూ ఒక ఆవరణ లోపల జరిగే సమావేశాన్ని అడ్డుకుని, రద్దు చేయించడం. మూడు, తమ వ్యాపారంలో భాగంగా ఒక పుస్తకాన్ని అచ్చు వేసినందుకు ప్రింటింగ్ ప్రెస్ మీద చర్యలు తీసుకోవడం. ఒక రచన, పుస్తక ప్రచురణ రాజ్యాంగ అధికరణం 19 (1)(ఎ) హామీ ఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛలో భాగం. అయితే ఆ రచన, పుస్తకం వెలువడిన తర్వాత, దానిలో అభ్యంతరకరమైన అంశాలున్నాయనుకుంటే, ఆ కారణాలు చూపుతూ గెజిట్ ప్రకటన ద్వారా నిషేధం విధించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. గత ఐదు దశాబ్దాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ విధంగా దాదాపు డజను పుస్తకాలను, అంతే సంఖ్యలో పత్రికల సంచికలను నిషేధించింది. వాటిలో కొన్ని నిషేధాలను ప్రచురణకర్తలు న్యాయస్థానాల్లో సవాల్ చేశారు. న్యాయస్థానాలు కొన్ని నిషేధాలను సమర్థించాయి, మరి కొన్ని నిషేధాలను కొట్టివేశాయి. ఒక పుస్తకం మీదనైతే 1986లో నిషేధం విధించిన ప్రభుత్వమే 1990లో నిషేధం ఉపసంహరించుకుంది. భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమైనదైనా అది చట్టబద్ధమైన ప్రవర్తనా పద్ధతి. కాని పుస్తకం ఇంకా వెలువడకముందే, దానిలో ఏమున్నదో సంపాదకులకు, ప్రచురణ కర్తలకు తప్ప మరెవరికీ తెలియకముందే, దానిలో అభ్యంతరకరమైన అంశాలు ఉన్నాయని ఊహించి ఆ పుస్తకం విడుదలను ముందస్తుగా అడ్డుకోవడం ఎంతటి దారుణ నియంతృత్వ పాలనలో కూడా జరగని పని. రష్యాలో పందొమ్మిదో శతాబ్ది చివరిలో జార్ చక్రవర్తుల పాలనలో అటువంటి ముందస్తు సెన్సార్‌షిప్ ఉండేది. ప్రతి పుస్తకమూ అచ్చుకు ముందే పోలీసులు చదివి ఆమోదించవలసి ఉండేది. కాని అది రాచరికం. ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలలో ఎక్కడా పుస్తకాల మీద ముందస్తు సెన్సార్‌షిప్ లేదు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో వార్తాపత్రికల మీద అటువంటి ప్రి-సెన్సార్‌షిప్ అమలయింది గాని, అది కూడా ఒకరకంగా చట్టబద్ధంగానే జరిగింది. ఎమర్జెన్సీలో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయవచ్చనే కారణంతో ప్రి-సెన్సార్‌షిప్ అమలయింది. తెలంగాణ ప్రభుత్వం జార్ చక్రవర్తి కాలంలోనో, ఎమర్జెన్సీ కాలంలోనో ఉన్నానని భ్రమ పడుతున్నదేమో తెలియదు. ఇక సమావేశం పెట్టుకునే హక్కుకు అధికరణం 19 (1)(బి) హామీ ఇచ్చింది. అటువంటి సభలు, సమావేశాల మీద 19 (3) ప్రకారం 'సహేతుకమైన ఆంక్షలు విధించడానికి' మాత్రమే ప్రభుత్వానికి అధికారం ఉంది గాని ఆ హక్కును పూర్తిగా కొల్లగొట్టి సభను రద్దు చెయ్యడానికి, అనుమతి నిరాకరించడానికి అధికారం లేదు. అసలు ఒక సభకు, సమావేశానికి అనుమతి కోరవలసిన అవసరమే లేదు. ఆ సభ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం, మైకుల వల్ల పరిసర ప్రజలకు ఇబ్బంది కలుగుతాయనుకుంటే, ఆ ఇబ్బందులను నియంత్రించడం కోసం పోలీసులకు సమాచారం ఇవ్వడం మాత్రమే నిర్వాహకుల బాధ్యత. అది బహిరంగ ప్రదేశాలలో జరిగే సమావేశాలకు మాత్రమే. ప్రాంగణం లోపల, హాలు లోపల జరిగే సభలకు అనుమతి కోరనవసరమూ లేదు, సమాచారం ఇవ్వవలసిన అవసరమూ లేదు. కాని నానాటికీ పెరిగిపోతున్న పోలీసురాజ్యం తనకు లేని 'అనుమతి అధికారం' కైవసం చేసుకుంది. హాలు యజమానులను బెదిరించి, హాలుకు అడ్డంగా నిలబడి సభకు వస్తున్నవారిని అరెస్టు చేసి ప్రాంగణం లోపలి సభలను కూడ కష్టసాధ్యం చేసింది. నవంబర్ 14 పుస్తకావిష్కరణ సభ విషయంలో జరిగినదిదే. అది చట్టవ్యతిరేకం, రాజ్యాంగ వ్యతిరేకం. మితిమీరిన అధికారం. పుస్తకంలో ఏమున్నదో తెలియకుండానే దాన్ని జప్తు చేసుకుని, అది అచ్చువేసిన వ్యాపార సంస్థ యాజమానుల మీద కేసు పెట్టడం అధికరణం 19 (1)(జి) ఇచ్చిన వ్యాపార స్వేచ్ఛను కాలరాయడమే. నేరస్థుడికైనా సరే చికిత్స చేసే వైద్యుడి మీద నేరారోపణ చేయడం కుదరదు. అలాగే వ్యాపారంగా నడుపుకునే ప్రింటింగ్ ప్రెస్‌కు ఎవరు వచ్చినా అచ్చువేసిపెట్టే యాజమానుల మీద కేసు పెట్టడం కూడా కూడని పని. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన తర్వాత చాల ప్రింటింగ్ ప్రెస్సులలో తాము అచ్చువేస్తున్న పుస్తకపు భాష, విషయం తెలియకుండానే అచ్చుపనులు జరుగుతున్నాయి. ఆ పుస్తకంలో ఉన్నాయనుకునే అంశాలకు ఆ ప్రెస్ యజమానులను బాధ్యులను చేయడం అసంగతం, అర్థరహితం, హాస్యాస్పదం. ఇంతకూ ఇప్పుడు పోలీసులు జప్తు చేసిన పుస్తకంలో ఏమి ఉంది? అది ప్రచురణకర్త రామకృష్ణ సహచరి శిరీషకూ, పోలీసులకూ తప్ప మరెవరికీ తెలియదు. రామకృష్ణ జీవితచరిత్ర అని ప్రచారం జరిగింది. అది నిజం కాదని, ఆ పుస్తకం రామకృష్ణ మీద వచ్చిన రచనల, రామకృష్ణ రచనల సంకలనం అని నవంబర్ 15న జరిగిన పత్రికా సమావేశంలో శిరీష చెప్పారు. అందులో రామకృష్ణ మరణానంతరం స్పందనగా వచ్చిన పాటలు, కవితలు, వ్యాసాలు, సంతాప ప్రకటనలు, శిరీష ఇంటర్వ్యూలు ఉన్నాయట. వాటితోపాటు ప్రభుత్వానికీ విప్లవోద్యమ నాయకులకూ జరిగిన చర్చల సందర్భంలో రామకృష్ణ రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఇంటర్వ్యూలు కూడా ఉన్నాయట. ఆ రచనలన్నీ ఇదివరకే పత్రికల్లో, టివి ఛానళ్లలో, సోషల్ మీడియాలో వెలువడినవే. 2004 అక్టోబర్‌లో చర్చల సందర్భంగా రామకృష్ణ పదిరోజుల పాటు మంజీర గెస్ట్‌హౌజ్‌లో ఉన్నప్పుడు ఆయనను ఎంతో మంది కలిశారు. ఎందరో విలేఖరులు ఆయనను ఇంటర్వ్యూ చేశారు. ఆయన వ్యాసాలు ఎన్నో పత్రికల్లో అచ్చయ్యాయి. ఆ రోజుల్లో ఆయన ఎంతోమంది తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. బహుశా అందువల్లనే ఆయన మరణవార్త వినగానే పత్రికల్లో, సోషల్ మీడియాలో స్పందన వచ్చింది. అలా ఇప్పటికే అచ్చయిన, వెలుగుచూసిన రచనలను సంకలనంగా ప్రచురించడం ఎందువల్ల నేరమయిందో తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన, విశ్వసనీయమైన జవాబు చెప్పవలసే ఉంది. అది ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వానికి ప్రజల హక్కులను కొల్లగొట్టే అధికారం లేదు. ప్రజలు చేసిన తప్పులను, నేరాలను విచారించడానికి భారత శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి ఉన్నాయి గాని, ప్రజల పేరు మీద ప్రభుత్వం చేసే తప్పులను, నేరాలను విచారించే ప్రక్రియ ఏమీ లేదు గనుక ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా, జవాబుదారీగా ఉండవలసి ఉంటుంది. అది రాజ్యాంగం పట్ల బాధ్యత, ప్రజల పట్ల బాధ్యత.

# అది బీజేపీ గెలుపు కానే కాదు

తెలంగాణ రాష్ట్ర సమితి ఓటమిలోనే కాంగ్రెస్ గెలుపు ఉందని హుజూరాబాద్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు భావించారు. ఎంతగా అధికార దుర్వినియోగం జరిగినా, ప్రజాకర్షక పథకాలు ఎన్ని పెట్టినా, విచ్చలవిడిగా డబ్బులు పంచినా, మద్యం ఏరులై పారించినా రానున్న శాసనసభ ఎన్నికలలో టీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను మట్టి కరిపిస్తామనే సందేశాన్ని తెలంగాణ ప్రజలు ఇచ్చారు. ఈటల రాజేందర్ బీజేపీ అభ్యర్థి అయినప్పటికీ ఆయన్ని ఒక వ్యక్తిగా గౌరవించి, గెలిపించాలని హుజూరాబాద్ ఓటర్లు నిర్ణయం తీసుకున్నారు. రాజేందర్ విజయం సాధించారు. అయితే అది బీజేపీ గెలుపు ఎంత మాత్రమూ కాదు. కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగితే రాజేందర్‌కు ఓట్లు తగ్గుతాయి కదా. తత్కారణంగా ఓట్లలో చీలిక వచ్చి, తెలంగాణ రాష్ట్ర సమితి ఎక్కడ గెలుస్తుందో అనే భయం కూడా హుజూరాబాద్ ఉపఎన్నిక సందర్భంగా కేసీఆర్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలు, ఓటర్లలో వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు రాజేందర్ మొదటి నుంచీ సన్నిహిత సహచరుడు. రాష్ట్రావిర్భావం తరువాత కేసీఆర్ మంత్రివర్గంలో రాజేందర్ రెండుసార్లు కీలక శాఖలు నిర్వహించారు. అయితే ఎలాంటి సహేతుక కారణాలు లేకుండా రాజేందర్‌ను మంత్రి వర్గం నుంచి అవమానకరంగా గెంటి వేయడాన్ని హుజూరాబాద్ ప్రజలు సహించలేక పోయారు. ఉద్యమ సహచరుడిని కేసీఆర్ అవమానించారని వారు ఆగ్రహించారు. రాజేందర్ తమలో ఒకరిగా మమేకమవడం వారికి నచ్చింది. ఇవన్నీ వ్యక్తిగతంగా రాజేందర్‌కు కలిసి వచ్చాయి. వివిధ సామాజిక సమీకరణాలు ఆయనకు సానుకూలంగా పరిణమించాయి. హుజూరాబాద్ ఉపఎన్నిక ఫలితం నిస్సందేహంగా రాజేందర్ వ్యక్తిగత విజయం. ఆ గెలుపును తమ విజయంగా బీజేపీ బలంగా భావించడం సరి కాదు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన పద్ధతిని ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్‌ను బలహీనమైనదిగా చిత్రించాలని, ప్రజల ముందు ఆ పార్టీని చులకనగా నిలబెట్టాలని కొందరు తమ కురుచతత్వాన్ని బయట పెట్టుకుంటున్నారు. టీఆర్‌ఎస్, బీజేపీ చీకటి దోస్తానా, పై పై కుస్తీ పోటీల నుంచి దృష్టి మళ్లించి, కాంగ్రెస్ మీద బురద చల్లే ఎత్తులు వేస్తున్నారు. ఈటల రాజేందర్ రాజీనామా ఆమోదం పొందిన వెంటనే అభ్యర్థిని ప్రకటించలేదని, అందుకు ఏవో రహస్య కారణాలు ఉన్నాయంటూ మరి కొందరు తలా తోకా లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి అంటగట్టాలని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒక అభ్యర్థిని ప్రకటించడానికి ఒక విధానం ఉంది. స్థానిక నాయకుల అభిప్రాయం, జిల్లాకు చెందిన అగ్రనాయకుల ప్రతిపాదనలకు అనుగుణంగా రాష్ట్ర, కేంద్ర నాయకత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది. హుజూరాబాద్ ఉపఎన్నిక విషయంలోనూ అదే విధానాన్ని అనుసరించింది. గత ఎన్నికలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థిని అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ నయానా, భయానా తమలో చేర్చుకుంది.

ఇది కూడా కాంగ్రెస్ పార్టీలో కొంత అయోమయాన్ని కలిగించిందనేది వాస్తవం. యువకుడు, పార్టీకి కట్టుబడి, అంకితభావంతో పనిచేసే అభ్యర్థిని ఎంపిక చేయాలని జిల్లా నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం సమష్టిగా తీసుకున్న నిర్ణయం మేరకే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిర్ణయం, ప్రకటన జరిగింది. ఇది రేవంత్ రెడ్డి వ్యక్తిగత, ఏకపక్ష నిర్ణయం అనే ప్రచారం పూర్తిగా అవాస్తవం. పార్టీ తీసుకున్న నిర్ణయం మేరకు నామినేషన్ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. హుజూరాబాద్‌లో 6 సభలను నిర్వహించారు. రాష్ట్ర నాయకులు కూడా ఒక్కొక్క బూత్ ఇన్‌చార్జిగా శక్తి వంచన లేకుండా పని చేశారు. రాజకీయాల్లో ఫలితాలు సాధారణంగా ఒక్క అంశం మీద ఆధారపడి ఉంటాయి. హుజూరాబాద్ ఉపఎన్నిక కేవలం ఇద్దరు వ్యక్తుల (కెసీఆర్, ఈటల రాజేందర్) మధ్య ఆధిపత్య పోరాటం. ఇక్కడ కేసీఆర్‌ను ప్రజలు అసహ్యించుకున్నారు. ఇందుకు గత ఏడేళ్ళ కాలంలో కేసీఆర్ ప్రభుత్వ పనితీరు, విధానాలు, ఆయన అహంకారం వంటివన్నీ దోహదం చేశాయి. కేసీఆర్ వ్యతిరేక ఓట్లు చీలకూడదు, టీఆర్‌ఎస్ గెలవకూడదు అని గట్టిగా నిర్ణయించుకున్నారు. 2004 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అంతకుముందు సిద్దిపేటలో జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు కేవలం 3000 ఓట్లే వచ్చాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం.

# కుప్పంలో కనిపించని పోరాటం




తిరుపతి, నవంబరు 18 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు మున్సిపల్ ఎన్నికలు షాకిచ్చాయనే చెప్పాలి. మూడు ప్రాంతాల్లో ఎక్కడా టీడీపీకి ఫలితాలు అనుకూలంగా లేవు. కేవలం ఒక్క మున్సిపాలిటీలోనే టీడీపీ విజయం సాధించింది. అక్రమాలు జరిగాయని తప్పించుకోవచ్చు. వైసీపీ దౌర్జన్యాలని చెప్పి చంద్రబాబు డైలాగ్ లు కొట్టవచ్చు. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే ప్రజలు టీడీపీకి అనుకూలంగా లేరన్నది మరోసారి అర్థమయింది. సొంత నియోజకవర్గం కుప్పం మున్సిపాలిటీ చేజారిపోవడం రాష్ట్రంలో టీడీపీ దుస్థితికి అద్దం పడుతుంది. చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కేవలం రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాయతీ అని ప్రజలను డైవర్ట్ చేయాలనుకుంటే పొరపాటే. జనంలోకి వెళ్లకుండా పార్టీ కార్యాలయంలో కూర్చుని వైసీపీ పై నిందలు వేస్తే ప్రజలు పట్టించుకోరని ఇప్పటికే అనేక ఫలితాలు వెల్లడించాయి. కానీ చంద్రబాబు మాత్రం తన పద్ధతి మార్చుకోలేదు. అనుకూల మీడియా సహకారంతో అందలం ఎక్కవచ్చని భావిస్తున్న చంద్రబాబుకు కుప్పం ఫలితాలే గుణపాఠం చెప్పాయని అనుకోవాలి. నిజానికి కుప్పంలో అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడి ఉండవచ్చు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి ఉండవచ్చు. కానీ నువ్వు మూడు దశాబ్దాలుగా కుప్పంలో ఉండి సాధించిందేమిటన్న సందేహం ఖచ్చితంగా కలుగుతుంది. ఏడు సార్లు కుప్పం ప్రజలు గెలిస్తే అక్కడ నీ పట్టేమిటన్న ప్రశ్న తెలెత్తుతోంది. ఎన్ని ప్రలోభాలు పెట్టినా నీ నాయకత్వం సరిగ్గా ఉంటే ప్రజలు ఎందుకు అటు వైపు మొగ్గు చూపుతారు. దొంగ ఓట్లంటూ తప్పించుకోవడానికి చూస్తే నిన్ను ఏమీ అనలేం. నీ ఖర్మ అని వదిలేయడం తప్ప. అన్ని చోట్లా మంచి ఫైట్ ఇచ్చినా? ఇక మిగిలిన మున్సిపాలిటీల్లో నాయకత్వం ఉన్న చోట కొద్దో గొప్పో టీడీపీ పోరాడింది. దాచేపల్లిలో మంచి ఫైట్ ఇచ్చింది. 12 మున్సిపాలిటీల్లో కుప్పం తప్ప అన్ని చోట్లా టీడీపీ కొద్దోగొప్పో ఫైట్ ఇచ్చింది. దీనిని ఏమనుకోవాలి. నాయకత్వ సమస్య అనుకోవాలా? ఇప్పటికైనా చంద్రబాబు పరనిందలను మానుకుని ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిది. లేదు.. నేనింతే అని అనుకుంటే వచ్చే ఏ ఎన్నికల్లో అయినా ఇదే రకమైన ఫలితాలు చూడక తప్పదు. నాయకత్వం ఉన్నా ప్రజల్లో నమ్మకం కల్గించలేకపోవడమే ఈ ఓటమికి ప్రధాన కారణం.

## పెడన జడ్పిటిసి ఉపఎన్నిక టిడిపి కైవసం టిడిపి చేతిలో చిత్తుగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ



బంటుమిల్లి (పెడన) ప్రజా పాలన ప్రతినిధి నవంబర్ 18: కృష్ణాజిల్లా పెడన జడ్పిటిసి స్థానాన్ని టిడిపి కైవసం చేసుకొంది గురువారం జరిగిన ఓట్ల ఫలితాలతో టిడిపి అభ్యర్థి అర్జ వెంకట నగేష్ తన సమీప వైసిపి అభ్యర్థి గుడిసేవ లక్ష్మి రాణి పై 644 ఓట్ల మెజార్టీ తో గెలుపొందారు అధికార పార్టీ ఎమ్మెల్యే జోగి రమేష్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జడ్పిటిసి ఉప ఎన్నికలు టిడిపి అభ్యర్థి వెంకట నగేష్ విజయం సాధించడంతో వైయస్సార్సీపి పార్టీకి ఊహించని భారీ షాక్ తగిలింది అధికారంలో ఉండి వైయస్సార్ సిపి పార్టీ అభ్యర్థి ఓటమి చెందడంతో కార్యకర్తలు నాయకులు నిరాశకు లోనయ్యారు పెడన రూరల్ గ్రామాల్లో గత ఐదు రోజులుగా ప్రచారం నువ్వానేనా అన్నట్టుగా నిర్వహించారు పెడన ఎమ్మెల్యే జోగి రమేష్ టిడిపి ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్ లు పార్టీ అభ్యర్థుల విజయం కోసం ముమ్మర ప్రచారం నిర్వహించార ఇరు పార్టీ నాయకులు కూడా పోలింగ్కు ముందు రోజు ఓటర్లకు మద్యం నగదు ఎర్ర చూపించారు ఏదేమైనా పెడన ప్రజలు మంచి వ్యక్తిని జడ్పిటిసి గా ఎన్నుకున్నారు అనేది ఈ జడ్పిటిసి ఉప ఎన్నికలకు నిదర్శనం వైయస్సార్సీపి అభ్యర్థి లక్ష్మీ రా నీకు 9291 తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వెంకట నగేష్ 9969 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 120 379 ఓట్లుగా ప్రకటించారు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అర్జా వెంకట నగేష్ 6 4 4 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లుగా రిటర్నింగ్ అధికారులు ఎన్నిక ధ్రువపత్రం అందించారు అధికారంలో ఉండి కూడా జడ్పిటిసి స్థానం పరాజయం పాలవడంతో పార్టీ నాయకులు లోలోపల మధనపడు తున్నారు అటు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు ఈ విజయానికి కారణం కీర్తిశేషులు కాగిత వెంకట్రావు అని అందు నా వెంట ఉండి వెన్నుతట్టి నా విజయానికి యువ నాయకులు కాగిత కృష్ణప్రసాద్ అని వెంకట నగేష్ అన్నారు ముందు పెడన పట్టణ అభివృద్ధివైపు పని చేస్తామని మీడియాకు తెలిపారు.

## జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలో కోట సుబ్బారావు కు సత్కారం




అవనిగడ్డ: నవంబరు 16 ప్రజాపాలన ప్రతినిధి– అవనిగడ్డ ప్రెస్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుని జాతీయ పత్రికా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో లో అవనిగడ్డ సీనియర్ పాత్రికేయులలో ఒకరైన కోట సుబ్బారావుని క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు దీవి సారంగపాణి అయ్యగార్, సింహాద్రి కృష్ణ ప్రసాద్, అవనిగడ్డ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ పత్రికా దినోత్సవం ఆవశ్యకతను పత్రికా విలువలను కాపాడుకునే అంశాలపై వివరించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటంతో తోపాటు అందులో పని చేస్తున్న పాత్రికేయుల జీవితాలకు భరోసా,భద్రత కల్పంచేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అవనిగడ్డ ప్రెస్ క్లబ్ కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు జే వీ.ఎస్ శాస్త్రి, అలపర్తి గోపాలకృష్ణ, చందు శ్రీనివాసరావు, సామర్ల మల్లికార్జునరావు, ఇమ్మడిశెట్టి రామారావు, వైయస్సార్సీపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలు చేయాలి




గోనెగండ్ల ప్రజాపాలన న్యూస్:–పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు పాతర వేసే దానిలో భాగంగా ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎత్తివేతకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని జిల్లా నాయకులు బిసి ఎస్టి మైనార్టీ విద్యా సమైక్య మద్దిలేటి ఆరోపించారు, గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల సమైక్య ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు గోడపత్రికలు విడుదల చేశారు ఈ సందర్భంగా మద్దిలేటి మహబూబ్ బాషా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రియంబర్స్మెంట్ పథకం ద్వారా ఇంటర్ నుండి పిజి వరకు ఏ కాలేజీలో అయినా ఏ కోర్సుల్లో అయినా ఎంత ఫీజు అయినా పూర్తి పూరి గుడిసెలో ఉండే విద్యార్థి కూడా ఉన్నత చదువులు చదువుకోవలన్న మంచి ఆశయంతో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు ఈ పథకం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఇంటర్ డిగ్రీ పీజీ ఇంజినీరింగ్ మెడిసిన్ వంటి కోర్సులు ఉచితంగా చదువుకున్నారన్నారు వైసిపి అధినేత సీఎం జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఎన్నికల ముందు పాదయాత్రలో తండ్రి ఆశయాలను కొనసాగిస్తామని సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగిస్తామని ఏ విద్యార్థి ఫీజులో లక్ష ఉన్న కూడా బరిస్తామని చెప్పి నేడు పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంటు తీసివేశారాని ఆవేదన వ్యక్తం చేశారు బిసి ఎస్టి మైనార్టీ ఓసిలో ఉన్న పేద విద్యార్థులకు మరియు మైనార్టీ ఎంబీఏ ఎంసీఏ ఈలాంటి ప్రొఫెషనల్ కోర్సులు చదవకూడదా అని ప్రశ్నించారు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు ఎప్పుడూ లేనట్టుగా డిగ్రీ కళాశాలలో 30 శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం అమ్మకోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఏఏ ఫీజులు నిర్ణయించినదో ఆ ఫీజులను నేరుగా విద్యాసంస్థల యజమానుల ఖాతాల్లో జమ చేసి ఏ విద్యార్థి నుంచి కూడా ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ సంక్షేమ హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు కళాశాల స్థాయి హాస్టల్ కు సొంత భవనాలను నిర్మించి విద్యారంగ సమస్యల పరిష్కరం చూపాలన్నారు త్వరలో విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాదిక్ మహబూబ్బాషా తిరుమలేష్ శరత్ నాయుడు సలీం రాఘవా మంజునాథ్ విజయ్ చంటి మునిస్వామి రాజేష్ సుభాష్ రంజిత్ చిన్న,విజయ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లకి ఆర్థిక చేయూత



పులివెందుల, ప్రజాపాలన ప్రతినిధి:లింగాల మండల లో డ్వాక్రా మహిళలు చేపట్టిన మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లకి ఆర్థిక చేయూత అందజేయనున్నట్లు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వైయస్సార్ క్రాంతి పదం ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్నపల్లి ఇప్పట్ల లింగాల కోమన్నూతల వెలిదండ్ల అంబకపల్లి మొదలైన గ్రామాలలో డ్వాక్రా మహిళలు నిర్వహిస్తున్న పలు రకాల మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను కమ్యూనిటీ కో ఆర్డినేటర్ లతో కలసి సందర్శించారు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ, ప్యాకింగ్ చేయడం మరియు మార్కెటింగ్ చేయడం ద్వారా జీవనోపాధి పొందుతున్న మహిళలకు 40 వేల రూపాయలు సూక్ష్మ రుణ ప్రణాళిక ప్రకారం అందజేస్తామని తెలిపారు. డ్వాక్రా సంఘం లో సభ్యురాలు మంచి నాణ్యమైన ఆహార పదార్థాలు తయారు చేయడం సప్లై చేయడం ద్వారా మహిళ ఎంటర్ ప్రెన్యూర్షిప్ డెవలప్ చేయుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు ఎంచుకున్న రంగాలలో పెట్టుబడిని సమకూర్చుట కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వైయస్సార్ ఆసరా డ్వాక్రా రుణమాఫీ నిధులు విడుదల చేస్తుందని వైయస్సార్ చేయూత పథకం, శ్రీనిధి, జగనన్న తోడు పథకాల నిధులతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ జయపాల్ గ్రామ సమాఖ్య అసిస్టెంట్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు....

## జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం సద్వినియోగం చేసుకోండి: మునిసిపల్ కమిషనర్ డి.రవీంద్ర



చిలకలూరిపేట: (ప్రజాపాలన ప్రతినిధి)ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ ప్రవేశపెట్టిన జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ డి.రవీంద్ర కోరారు. గురువారం కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా రుణాలు పొంది ఇళ్లు నిర్మించుకున్న, ప్రభుత్వం ఇచ్చి న పట్టా భూమిలో ప్రభుత్వ లబ్దితో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఈ పథకం ద్వారా రుణాలు ఏవీ కూడా లేనట్లుగా క్లియరెన్స్ సర్టిఫికెట్ పొందవచ్చున్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు పట్టణ పరిధిలో లబ్దిదారులు రూ. 15 వేల రూపాయలు సచివాలయంలో చెల్లించాలన్నారు. చెల్లించిన వారికి డిసెంబరు 21 న వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇళ్లు రెండు మూడు చేతులు మారితే వారు రూ.30 వేలు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సంబంధిత ఆస్తి క్రయ, విక్రయాల సమయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

## అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు: టి యన్ యస్ ఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ విద్యార్థి విభాగం




చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నాశనం చేసే ప్రభుత్వ జీవోలు 42,50,51 లను తక్షణమే రద్దు చేయాలని అడిగితే అక్రమ అరెస్టు చేస్తారా! అని చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నాశనం చేసే ప్రభుత్వ జీవోలు 42,50,51 లను తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో ఏపి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. ఉద్యమాలను, పోలీసులను ఉపయోగించి అణచివేయాలని ప్రయత్నించడం నీచమైన చర్య అని మండిపడ్డారు. ఎయిడెడ్ విద్యావ్యవస్థను నాశనం చేస్తున్న జీవోలను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగేది లేదు అని ఈ సందర్భంగా తెలియజేశారు. అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నాశనం చేసే ప్రభుత్వ జీవోలు 42,50,51 లను తక్షణమే రద్దు చేసే వరకు పోరాడతామని తెలియజేశారు. ప్రభుత్వ జీవోలు రద్దు చేసే వరకు ఏ త్యాగానికైనా వెనుకాడమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీ యన్ యస్ ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జాకీర్ హుస్సేన్, చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు గట్టినేని విజయసాయి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు షేక్ అజార్, మాలెంపాటి ప్రవీణ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి మద్దిబోయిన చంద్రశేఖర్ మరియు పలువురు నాయకులు రఘువీర్(పండు), గోపిదేశి బాలయ్య, రాజు, ఫజల్ ఖాన్, శరత్, జశ్వంత్(బుజ్జి) తదితరులు పాల్గొనడం జరిగింది.

## మందాడి చెరువు ను పరిశీలించిన ఆర్డిఓ



కావలి, నవంబర్ 18, ప్రజాపాలన ప్రతినిధి: పట్టణం లోని మందాటి చెరువును గురువారం ఆర్డిఓ శీనా నాయక్ , మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి, తహశీల్దార్ మాధవరెడ్డి పరిశీలించారు. నిలిచిన వర్షపు నీరు ను ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతామని చెప్పారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు ఎక్కువగా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతుంటే తమకు తెలియ చేయాలని చెప్పారు. ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు

## వ్యక్తిగత వికాసానికి ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలి: గ్రంథాలయ అధికారి కావూరి రమాదేవి



చిలకలూరిపేట: (ప్రజాపాలన ప్రతినిధి)54వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజైన గురువారం విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 120మంది విద్యార్థులు పాల్గొని జాయోద్యమంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాస రచన రాసారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని కావూరి రమాదేవి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలన్నారు.బాల్యంలోనే పఠనం పై అభిరుచి కలిగి ఉండాలన్నారు. తీరిక సమయంలో గ్రంథాలయంకు వచ్చి పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రమాదేవితో పాటు సిబ్బంది శివపార్వతి, వలి, వీర్రాజు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

# కష్టానికి దక్కిన ఫలితం:మందా జక్రి విజయం



జి.కొండూరునవంబర్ 18: (ప్రజాపాలనప్రతినిధి)జి. కొండూరు మండల జెడ్పిటిసిగా వైసీపీ నేత మందా జక్రధరరావు (జక్రి) ఎన్నికయ్యారు. ఆయన విజయం కష్టానికి దక్కిన ఫలితంగా పలువురు పేర్కొంటున్నా రు.ఆయన సమీప ప్రత్యర్థి గరికపాటి జైపాల్ పై4893 ఓట్లు బారి మెజార్టీతో గెలుపొందినారు. జి.కొండూరు మండలంలోని కందులపాడు గ్రామంలో మందా జక్రి మందా జయరాజు, రాఘవమ్మ దంపతులకు అక్టోబ ర్ 27, 1976న జన్మించారు. పువ్వు పుట్టగానే పరి మళిస్తుందన్నట్టు మందా జక్రి యుక్త వయసులోనే క్రియాశీలక రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిం చా రు. మందా జక్రి తండ్రి జయరాజు కాంగ్రెస్ పార్టీలో సీ నియర్ నేతగా గుర్తింపు పొందారు. మందా జయరాజు రెండు పర్యాయాలు కందులపాడు సర్పంచ్ గా ప నిచేశారు. అప్పటినుంచీ మందా జక్రి ఎంతో బా ధ్య తగా ప్రజా సమస్యలపై స్పందించేవారు. నిత్యం ప్రజ ల్లో ఉంటూ ప్రజా సేవలో నిమగ్నమయ్యారు. వైఎస్ఆ ర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత జిల్లా ప్రచార క మిటీ సభ్యునిగా మందా జక్రి వైసిపి బలోపేతానికి కృ షి చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా కక్ష సా ధింపు చర్యలు చేపట్టిన సమయంలో మందా జక్రి కక్ష సాధింపు చర్య నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చే పట్టారు. 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలో తన స్వంత సొ మ్మును ఖర్చుపెట్టి పార్టీ కార్యాలయాన్ని నిర్వహిం చారు. 2019లో మైలవరం ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాద్ గెలుపు కోసం కృషి చేశారు. ఒక పక్క మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అధికారంలో ఉండగా తెలుగుదేశం పార్టీ ప్రజా వ్యతిరేక విధానా లను నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి కృషి సల్పారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి అప్పట్లో చేపట్టిన పాదయాత్రలో మందా జక్రి పాల్గొన్నారు. వె న్నంటే ఉండి ప్రోత్సహించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఓట రు దేవుళ్ళకు కృతజ్ఞతలు తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయంపై బృంద చర్చ..



తల్లాడ, నవంబర్ 18 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ రైతు వేదిక కార్యాలయంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయంపై గురువారం రైతులతో బృంద చర్చ నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం లో భాగంగా సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తల్లాడ వ్యవసాయ అధికారి ఎం.డి.తాజుదిన్, వ్యవసాయ విస్తరణ ఆదికారి కే.గురుమూర్తి, ఆధ్వర్యంలో రైతులతో బృంద చర్చ జరిపారు. ఈ సందర్భంగా రైతులతో సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత గురించి చర్చించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు వి. సంజిత్ కుమార్, పి. ఉమా మహేష్, యస్. వినయ్ వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని కలిసిన జడ్పీటీసీ ప్రమీల దంపతులు..



తల్లాడ, నవంబర్ 18 (ప్రజా పాలన న్యూస్):తల్లాడలో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎం. సురేష్ ను తల్లాడ జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, దాసురావు దంపతులు గురువారం పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ విధినిర్వహణలో మండల ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు(జి వి ఆర్), ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరథన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని ఇందిరాపార్కు వద్ద ధర్నా



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి గురువారం రోజు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ లొ రైతులు పండించిన వరీ ధాన్యం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి లని డిమాండ్ చేశారు ఇందిరా పార్క్ వద్ద జరిగే టీఆర్ఎస్ మహా ధర్నా కార్యక్రమానికి రైతులుకు మద్దతుగా ఇబ్రహీంపట్నం వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, 24. వ వార్డు కౌన్సిలర్ జర్కొని బాలరాజ్ సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల రాజు, గుంటి బింరావు, మహేష్ తదతరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకుంటున్న దంపతులు



పాలేరు నవంబర్18 ప్రజాపాలన ప్రతినిధితనకున్న దాంట్లో నలుగురికి సహాయం చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు ఆదంపతులు.ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువగా వచ్చేది నిరుపేదలే. అలాంటి వారికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యం తో తన సొంత ఖర్చు లక్ష రూపాయల తో రెండు ఏసీలను కూసుమంచి ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. జడ్పీటీసీ ఇంటూరి బేబీ శేఖర్.భర్త అడుగు జాడల్లో నడుస్తూ తనుకూడా ప్రజా సేవలో ముందుంటున్నారు బేబీ శేఖర్.కూసుమంచి ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యం తో తన సొంత డబ్బులతో రెండు ఏసీ లను ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లభిస్తుందన్నారు.. ఎమ్మెల్యేకందాళ ఉపేందర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కి పాటుపడుతున్నారని బేబీ శేఖర్ అన్నారు.ఎమ్మెల్యే గారి తోడ్పాటు తో కూసుమంచి మండలం లోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా మధిర టు అన్నవరం అన్నవరం, పంచారామలకు ప్రత్యేక బస్సులు



మధిర నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి మధిర డిపో నుండి కార్తీకమాసం దృష్టిలో పెట్టుకొనిఅన్నవరం మరియు పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు మధిర డిపో మేనేజర్ ఎస్ దేవదానం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మధిర నుండి ప్రత్యేక బస్సుబయలుదేరుతుందని తెలిపారు. అదేవిధంగా 40 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఏ ప్రదేశమున కైనా వెళ్ళుటకు సంప్రదించిన ఏరోజైనా బస్సు సౌకర్యం కల్పించబడుతుంది. భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనగలరు.

## వరి ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి: టిఆర్ఎస్ శ్రేణులు



ఇబ్రహీంపట్నం అక్టోబర్18 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం వైఖరికి నిరసనగా నేడు హైద్రాబాద్ ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి , టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరాపార్క్ మహాధర్నా లో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, యాచారం మండల జెడ్పిటిసి చిన్నొళ్ళ జంగమ్మ యాదయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు జోగిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాజేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంగెం రాజు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దెల శశికళ, టీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మల్కాపురం శివశంకర్, నాయకులు పి. జంగయ్య, డి.జంగయ్య, బిక్షపతి, రాందాస్, రాజు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభించక ముందే పాడైపోయిన టాయిలెట్స్



బెల్లంపల్లి నవంబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి: ప్రజలకు ఉపయోగ కరంగా ఉంటుందని నిర్మించిన సులభ టాయిలెట్ ప్రారంభించక ముందే పాడైపోయి పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధం పూరితంగా తయారయ్యిందని బెల్లంపల్లి పట్టణ వ్యాపారస్తుల సంఘం ప్రతినిధి కొలిపాక శ్రీనివాస్ అన్నారు.మంగళవారంనాడు ఆయన మాట్లాడుతూ స్థానిక ఆంధ్ర బ్యాంక్ ఎదురుగా మున్సిపల్ వారు నిర్మించిన టాయిలెట్ కు నీళ్ల సౌకర్యం కల్పించకపోవడం తో వినియోగదారులు వాటిని వినియోగించడంతో మరుగుదొడ్లు జామ్ అయి పోయి దుర్గంధం వస్తుందని, బ్యాంకుకు వచ్చే కస్టమర్లకు మరియు ఆ దారిన నడిచే ప్రజానీకానికి ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి నీటి సౌకర్యం కలిపించి ప్రారంభించాలని ఆయన కోరారు.

## మత్స్యగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు



యాదాద్రి నవంబర్ 18 వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోగల శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవం లో భాగంగా గురువారం పూజా కార్యక్రమాలుయాగశాల ద్వారతోరణార్చన, చతుస్థానార్చన హెూమం, ఉత్సవమూర్తులకు స్నపనము,శంఖధార, చక్రధార,సహస్రధార తో అభిషేకం,అలంకారము బలిప్రధానం,శాత్తుమొర, తీర్థప్రసాద గోష్టి పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి,ఈఓ కె రవికుమార్, ధర్మ కర్తలు,ఆలయ అర్చకులు,సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం వ్యాక్సిన్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి :గురువారం రోజు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం నందు వైద్య సిబ్బంది మరియు పంచాయతీ రాజ్ సిబ్బందితో కలసి ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలకు గాను, 3 గ్రామ పంచాయతీలలో అనగా 1. చర్ల పటేల్ గూడా, 2. కప్ప పహాడ్ 3. కర్ణంగోడా గ్రామపంచాయతీలో గల ప్రజలు మొదటి విడత కరోనా వ్యాక్సిన్ ?? వంద శాతం పూర్తి చేసుకోవడం జరిగినది. ఆ గ్రామ ప్రజాప్రతినిధులకు వైద్య సిబ్బందికి, గ్రామపంచాయతీ సిబ్బందికి, అంగన్వాడి వర్కర్లకు మరియు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము. మరియు తేదీ 17.11.2021 నుండి ఆర్ గర్ల్ దస్తక్ రెండవ దఫా వ్యాక్సిన్ సర్వే ప్రారంభం కాబడినది. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొని సర్వే పూర్తి చేయుటకు అందరూ సహకరించాలని కోరడమైనది.ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.మహేష్ బాబు, వైద్యాధికారి %ఎ.జీ%.అభిరామ్, శ్రీ టిసుస్, పర్యవేక్షకులు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాలు: చైర్ పర్సన్ వెంకటేష్



వికారాబాద్ బ్యూరో 18 నవంబర్ ప్రజాపాలన : జిల్లాలో 13 మంది బాలలకు నెల నెలా రూ. 2000 లు ప్రభుత్వం నుండి అందచేయడం జరుగుతుందని చైర్ పర్సన్ వెంకటేష్ తెలిపారు. గురువారం చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాలలో బాగంగా జిల్లాలోని 11 మండలాలలో కోవిడ్ ప్రభావంతో తల్లిదండ్రులను కోల్పోయిన బాలలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు వారి తలిదండ్రులను కోల్పోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి కి తెలియజేశారు. వారు విద్యకు సహకారంతో పాటు ఆర్థిక సహాయం చేయాలనీ కోరారు. మిగతా బాలలందరికి పీఎం కేర్ పథకం ద్వారా ఇతర పథకాల నుండి అందరికి సహాయం అందేలా చూస్తామని మీరందరు ధైర్యంగా ఉండాలని మీకు ప్రభుత్వ నుండి అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్య క్రమములో చైల్డ్ లైన్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రకాష్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సభ్యులు దేవకుమారి, యాదయ్య, నర్సిములు, వెంకటేష్, రాంచంద్రయ్య, సంజమ్మ, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



కోరుట్ల, నవంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి):మాదాపూర్ గ్రామానికి చెందిన మిట్టపెల్లి ప్రతాప్ తండ్రి లక్ష్మయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి నర్సింగరావు వీరి వెంట బోయినిపెల్లి సత్యంరావు,కొంతం రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ,తిరుమల గంగాధర్, కటుకం రాజారెడ్డి, బద్దం దేవరెడ్డి ,రాజేష్ తదితరులు ఉన్నారు.

## సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు దంపతులకు ఘన సన్మానం



కొడిమ్యాల, నవంబర్ 17 (ప్రజాపాలన ప్రతినిధి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో ఈనెల 22వ తేదీన నిర్వహించే జాతీయ స్థాయి సదస్సుకు కొడిమ్యాల మండల సర్పంచ్ల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు ఎంపిక కావడంతో టిఆర్ఎస్ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ శుకూర్,కొ-ఆప్షన్ సభ్యులు నసీరొద్దీన్ ,మాజీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఇంతియాజ్ కృష్ణారావు దంపతులను షాలువాతో గణంగా సన్మానించారు.వారితోపాటు టిఆర్ఎస్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఎండ్రికాయల శ్రీనివాస్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామాఛార్య, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది ఆత్మహత్య



జగిత్యాల, నవంబర్, 18 ( ప్రజాపాలన ప్రతినిధి): పట్టణంలోని విజయపురి కాలనీ కి చెందిన సీనియర్ అడ్వకేట్ మేకల రాజేశ్వర్ (58) ధర్మపురి ప్రధాన రహదారిపై గల దొడ్డి కొమరయ్య విగ్రహానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేశ్వర్ జగిత్యాల కోర్టులో సీనియర్ అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తున్నారు, మృతునికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కలత చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు అక్కడి ప్రజలు అంటున్నారు. సీనియర్ అడ్వకేట్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్ల తోటి అడ్వకేట్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర కుర్మ సంక్షేమ సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరించే రాజేశ్వర్ మృతి విషయాన్ని తెలుసుకున్న కుర్మ సంఘ సభ్యులు, జిల్లా నాయకులు వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## మా లోకం

'నాన్న పోవడంతో' అమ్మ కలల మహావృక్షం కూలిపోయింది... అమ్మ నాన్నకు గుండెలో గుడికట్టింది. దేవుళ్ల ఫొటోలన్నీ అటక ఎక్కించింది. గ్రూపు ఫోటోలోంచి నాన్న ఫోటో పెద్దగ చేయించి ఫ్రేము కట్టించింది. రోజూ దండం పెట్టేది... దీపం వెలిగించేది. నాన్నను తలుస్తూ, వలపోస్తూ కన్నీరు పెట్టుకునేది అమ్మ... ఆ మొక్కిన చేతుల్తోనే అమ్మ గుడిలో మన్ను పోసింది. యాల్లపొద్దుగాల తీసుకపోయినందుకు ఏడ్చింది.. దేవుళ్లను శపించింది... అమ్మ గుండె దిటవు చేసుకుంది. అమ్మలో కొత్త కలల ఇల్లు... నాన్న జ్ఞాపకాలే వాసాలుగా... దూలాలుగా... అమ్మ కొత్తకలల ఇల్లు కట్టింది. తనపిల్లలను పెంచింది... నాన్న లేడు... నాన్న ఇప్పటికీ ఒక కల. నాన్న ఇప్పటికీ ఒక అందుకోలేని ఆదర్శం.

నాన్న లేడు... నాన్న ఎప్పుడో వెళ్ళిపోయాడు. ఎందుకు పోయాడో తెలియదు. బొంబాయిలో గ్రూప్ ఫోటో దిగిన నాన్న ఎంత అందంగా ఉన్నాడో... చెవికి ఒక పోగు.. ఆఫారం అంగీ, ధోతీ కోటు వేసుకున్నాడు. కాళ్లకు నిండైన చెప్పులు. చేతికి మిలమిల మెరిసే వాచీ.

నాన్న బతుకు గెలుచుకోవాలని ఉన్న ఊరు వదిలాడు. కన్నవారిని వదిలాడు బొంబాయి చేరాడు. మిల్లు కార్మికుడయ్యాడు... ఉన్న ఊళ్లో కష్టపడి కొత్త ఇల్లు కట్టాడు. అయినా బొంబాయికి పోక తప్పలేదు. కొద్దిరోజులు ఇల్లాలిని తీసుకువెళ్ళాడు. ఇద్దరికి ఆ జీతం చాలదు.. నాన్న ఒకచోట, అమ్మ ఒకచోట. ఎవరో బొంబాయినుంచి వస్తారు. కొన్ని మూటలు తెస్తారు.. ఇవి పంపించాడని చెప్తారు. అవి చక్కని నూలు బట్టలు. అందులో ఎంతో ప్రేమ రంగరించి ఉంటుంది.

నాన్నకు ఇంటివద్దే ఉండాలని ఆరాటం. పారిశ్రామిక విప్లవం ఇంటిని, కుటుంబాన్ని విడదీసింది. కార్మికుడు ఒక్కడే చాలంది.. అతని కుటుంబం అక్కర్లేదంది. బొంబాయిలో ఉండడానికి ఇల్లు చాలదు

బతకడానికి కూలి చాలదు. తప్పనిసరై వారక్కడ, వీరిక్కడ ప్రపంచమంతటా పారిశ్రామిక విప్లవంతో జరిగిన క్రమమే... అది నాన్నకు పిల్లలంటే ఎంతో ఇష్టం. అక్కడికీ ఇక్కడికీ ఆసుపోసినట్టు పరుగు. పడుగు పేకల జీవితం పల్లెకు, పట్టణానికి పరుగు. ఏమైందో ఏమో... ఏ తిండి పడలేదో... నొప్పి... కడుపు నొప్పి... తీవ్రమైన కడుపునొప్పి... ఎనిమిది గంటలు నిలబడి సంచాల్లో విగ్రహంలా నిలబడి నిలబడి కాళ్ళు... కడుపులో మంట... కడుపులో ఏదో నొప్పి... భరించలేని నొప్పి... పనిచేయకుండా బొంబాయిలో ఉండడం ఎలా? ఇంటిబాట పట్టాడు.. అదేమి రోగమో తెలియదు. ఏమి తినరాదు... ఏది తిన్నా అరగదు... ఏది తిన్నా కడుపునొప్పి... రకరకాల వైద్యాలు... బీజకుట్టు అన్నారు.. తడిబట్ట వేశారు. పేగులో అన్నం జారిన కడుపునొప్పి.. హెర్నియా... అరచి అరచి... ఏడిచి ఏడిచి సొమ్మగిల్లి పోయాడు. శరీరం చల్లబడిపోయింది.. చనిపోయాడన్నారు... అంత చిన్న సమస్యకు మరణమే శరణమయ్యింది.

నాన్న ఎక్కడికి పోతున్నాడు అని పిల్లలు... నాన్న దేవునిదగ్గరికి పోతున్నాడు... రోజులు గడిచినకొద్దీ నాన్న ఏడీ అని పిల్లలు... తల్లికి ఏం చెప్పాలో తెలియదు... దేవుడు తీసుకొని పోయిండు... ఎప్పుడు వస్తాడు అని పిల్లలు... మీరు పెద్ద పెరిగినంక... అని తల్లి బొంబాయి పోయినట్టు బొంబాయినుంచి వచ్చినట్టు నాన్న మళ్ళీ వస్తాడని పిల్లల ఎదురుచూపులు... నాన్న లేడు ఇంట్లో నవ్వులు లేవు. నాన్న లేడు అమ్మకు తలలో పువ్వులు లేవు. నాన్న లేడు అమ్మకు నొసటిలో బొట్టు లేదు. మెడలో పుస్తెలు లేవు బంగారు గుండ్లు లేవు. నాన్న కట్టిన ఇల్లు ఇతరుల పాలైంది. ఏదైనా ఉన్నప్పుడు లేని లోటు తెలియదు. నాన్న ఒక నిట్టాడు... నాన్న ఒక మహావృక్షం... ఒక మహావృక్షం కూలిపోయింది...

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## నాదర్గుల్ లో అయ్యప్ప పడిపూజ



బాలాపూర్:నవంబర్18,ప్రజాపాలన (ప్రతినిధి : ఈ ఏడాదికి అయ్యప్ప పడిపూజ మూలాధారణ 18 కి చేరిందని భాగ్యనగర్ బ్యాంక్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్గుల్ గ్రామంలో అశోక గురుస్వామి ఆధ్వర్యంలో 18 మెట్ల పై అయ్యప్పపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఒకసారి హరిహరసుతుడి నామస్మరణతో భక్తులు తరించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ బ్యాంకు ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి మాట్లాడుతూ....ఈ యేడాదికి తన మాలాధరణ 18కి చేరిందనీ చెప్పారు. డిసెంబర్ 5వ తేదీన నాదర్ గుల్ గ్రామంలో గురుస్వాముల ఆశీస్సులతో పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ఏడాది కరోనా మహమ్మారి వల్ల మాల వేయలేదని అన్నారు. ఈ సంవత్సరం అయ్యప్ప కరుణతో 18 సార్లు పూర్తి చేసుకుంటున్నట్లు మర్రి నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం గురుస్వాములు పాల్వాయి లక్ష్మణ్, తిరుపల్లి సుధాకర్ యాదవ్, మర్రి చిన్న నర్సింహారెడ్డి, యాతం భిక్షపతి, దిండు మల్లేశ్, డాక్టర్ ఐలయ్య, జి. హనుమంతరావు సహా అయ్యప్పలు, స్థానిక భక్తులు, కుటుంబ సభ్యులు పడిపూజలో పాల్గొన్నారు.

## కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఎం కూటమి ఘనవిజయం



బోనకల్, నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలోని ముష్టికుంట్ల కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ ,సిపిఎం కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఎం కూటమి విజయం సాధించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుండి నలుగురు డైరెక్టర్లు విజయం సాధించగా సిపిఎం నుండి ఒక డైరెక్టర్ విజయం సాధించాడు. అధ్యక్షునిగా దార గాని నాగేశ్వరరావు(కాంగ్రెస్) ,కార్యదర్శిగా రామాపురం గ్రామానికి చెందిన దొంతు నారాయణ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా బంధం కమలమ్మ ( కాంగ్రెస్),మంద సీతమ్మ ( కాంగ్రెస్),దార గాని ఏడుకొండలు ( సిపిఎం)లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సందీప్, రవి , సొసైటీ సీఈఓ ఉమామహేశ్వరరావు లు వ్యవహరించారు.

## మహాధర్నా కు భారీగా బయలు దేరిన టిఆర్ఎస్ నాయకులు



యాదాద్రి నవంబర్ 18 వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం రైతులు పండించే వడ్లను కొనుగోలు చేయకుండా రైతుల పట్ల చూపుతున్న నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా వడ్లు కొనాలని డిమాండ్ చేస్తూ గురువారం హైద్రాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మండలం నుండి టీఆరెస్ శ్రేణులు భారీగా బయలు దేరారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి, కునపురి కవిత,మద్దెల మంజుల,మామిల్ల రత్నయ్య,పలుసం రమేష్, మీసాల శేఖర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

కొందుర్గు/జిల్లేడు చౌదరిగూడెం నవంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) :-మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో నివసించే తొండపల్లి దశరథం అనే వ్యక్తి కరెంట్ షాక్ తో మరణించాడు లైన్ మెన్ యాదవ రెడ్డి తన చేతికిందికి పిలుచుకొని స్తంభాలను ఎక్కించి గ్రామంలో ని తీగలను సరి చేస్తున్న క్రమంలో వైర్ లాగుతుండగా పక్కనే గ్రామంలోకి వచ్చే 31కేవీ పెద్ద లైన్ వుండటంతో తన చేతిలో వున్న వైర్ పెద్ద లైన్ కు తాకడంతో షాక్ తగలడంతో స్తంభం పై నుండి కింద పడటంతో దవాఖాన కు తీసుకు పోతుండగా మార్గమధ్యంలో మరణించాడని వివరించారు అయితే లైన్ మెన్ యాదవ రెడ్డి పెద్ద లైన్ %ూాఎ% తీసుకోకపోవడ మే అని గ్రామస్తులు వివరించారు

## ఆటో బోల్తా వ్యక్తి దుర్మరణం



ఇబ్రహీంపట్నం, నవంబర్18( ప్రజా పాలన ప్రతినిధి ) మండలంలోని అమ్మక పేట శివార్లలో మెట్పల్లి కోర్టు వాడకుచెందిన మృతుడు ఆ రెల్లి షారుక్ ఖాన్ వయసు 20 సంవత్సరాలు నిన్న రాత్రి సమయంలో ట్రాలీ ఆటో 15 %శ%7229 గల ప్రయాణిస్తుండగా మృతుడు ప్రయణిస్తున్న ఆటో బోల్తా పడి లేదా ఏదైనా ఇతర కారణం వల్ల గానీ మృతునికి కలిగిన గాయాల వల్ల మృతుడు చనిపోయి ఉండవచ్చు మృతుని మృతికి కారణమైన వ్యక్తులు మృతుని రోడ్డు పక్కన గల వరి పొలంలో ఉంచినట్లుగా ఉన్నది మృతుని అక్క పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగినది సంఘటన స్థలంకు మెట్పల్లి డిఎస్పీ మరియు మెట్పల్లి సిఐ సందర్శించారు ఎస్సై, జి సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజు పాలెం గ్రామంలో చైతన్య సదస్సు.....



ఎర్రుపాలెం నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలోని గురువారం రాజుపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం కరోనా వ్యాక్సిన్ నేషన్ మరియు డెంగ్యూ జ్వరం గురించి ప్రత్యేక బృందం ఒక సదస్సును నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మా స్కు ధరించాలి, కనీస దూరాన్ని పాటించాలని, ప్రతి ఇంటిలోనూ మురుగునీరు ఉండ కూడదని, దానిద్వారా దోమలు వ్యాపించి డెంగ్యూ జ్వరానికి దారితీస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూస్ పల్లి వెంకటరెడ్డి, కార్యదర్శి శివకుమార్, ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రథమ వర్ధంతి....



ఎర్రుపాలెం నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలోని గురువారం మేనవోలు గ్రామంలో మండల గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు ధివంగత శ్రీ వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, వేమిరెడ్డి అరవిందు, అహల్య రెడ్డి, ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షేక్ జానిభాషా, మధిర నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ రాజీవ్ గాంధీ, బెజ్జం శ్రీకాంత్, %ూజ% సెల్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసరావు, పిల్లి బోసు సర్పంచ్ లు మారబత్తుల మోహన్ రావు, బాబురావు, కుడుముల సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

## రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో జై భీమ్ పుస్తకాల పంపిణి



నవంబర్ 18. క్యాతనపల్లి. ప్రజా పాలన ప్రతినిధి. రామకృష్ణాపూర్ లోని బాలబాలికల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ఇండియా ఎస్సీ. ఎస్టీ. రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో డా: బిఆర్. అంబేద్కర్ చరిత్ర జై భీమ్ పుస్తకంను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర కార్యదర్శి పేరం రాజశేఖర్. మాట్లాడుతూ మన దేశంలో అత్యున్నతమైనది చదువు మాత్రమే అని అంబేద్కర్ జీవితం వివరిస్తూ చదువుకునే విద్యార్థులు అంబేద్కర్ అంత జ్ఞానాన్ని నేర్చుకొని సమాజానికి నేర్పించాలని అంబేద్కర్ జీవిత చరిత్రను అందరం చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొయ్యా రాంబాబు, సీనియర్ నాయకులు తాడినవీన్, పలగిరి కనకరాజు. పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి: జనసేన పార్టీ మధిర ఇన్చార్జ్ తాళ్లూరి డేవిడ్





బోనకల్, నవంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి:జనసేన పార్టీ ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గం బోనకల్ మండల కేంద్రంలో గవర్నమెంట్ కాలేజీ లో జనసేన పార్టీ మధిర నియోజకవర్గం విద్యార్థి విభాగం కార్యనిర్వాహక నెంబర్ గంధం ఆనంద్ అధ్యక్షతన విద్యార్థులకు సూచనలు సలహాలు ఇస్తు మధిర నియోజకవర్గం జనసేన పార్టీ బాధ్యులు తాళ్లూరి డేవిడ్ మాట్లాడుతూ ఈ సమాజంలో జరుగుతున్న డ్రగ్స్ గంజాయ్ మద్యపానాలు స్త్రీల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు మరియు విద్యార్థి విభాగం నుండి ఒక మంచి ఆలోచనతో మంచి వ్యక్తిత్వంతో ఆలోచనా విధానాలు ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళ్తారని ఉదాహరణకి డాక్టర్ బిఆర్ బిఆర్ అంబేద్కర్ , ఏపీజే అబ్దుల్ కలాం,సావిత్రి పూలే ఈ మహానుభావులే మనకు ఆదర్శమని ఈ ఉదాహరణ తీసుకొని విద్యార్థులు ఆలోచన విధానాలతో ముందుకు సాగాలని అదేవిధంగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ సమాజం పట్ల వారి ఉన్నతమైన విశాలమైన వారి కుటుంబాన్ని వదిలిపెట్టి ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజాసమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ మనం ఉండాలని మాకు నేర్పించారని పవన్ కళ్యాణ్ ఆశయాలను అనుగుణంగా ఈరోజు మధిర నియోజకవర్గం లో జనసేన పార్టీ విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థి విభాగం కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాలో బోనకల్ మండలం నాయకులు ఎస్ కే జానీ పాషా, లక్కీ శెట్టి సాయి కుమార్, ఎస్.కె అప్జల్ కోసూరు అశోక్ ,ఎస్ కె బాజీ బాబా వేముల వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



యాదాద్రి నవంబర్ 18 వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి :మండల పరిధిలోని వేములకొండ జోగు వెంకటయ్య కు చెందిన ఇసుక ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఆ గ్రామంలోని మూసి పరివాహక ప్రాంతం నుండి ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడి నిర్వహించి ట్రాక్టర్ ను గురువారం పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్సై రాఘవేందర్ గౌడ్ తెలిపారు.

## పట్నం చెరువు లో పార్కు నిర్మాణ పనులను ఆపివేసిన నీటిపారుదల శాఖ డి.ఇ ఉషారాని



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి :రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చెరువు లో నిర్మిస్తున్న టువంటి పార్క్ నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని నీటిపారుదల శాఖ డి.ఇ ఉషారాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం చెరువు శిఖం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేయడానికి అనుమతులు ఉండవని ఇట్టి చర్యకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం శిక్ష అర్హులని ఇబ్రహీంపట్నం చెరువు లో నిర్మిస్తున్న టువంటి పార్కు నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాకింగ్ నిర్మాణం కోసం పని చేస్తున్న జెసిపి తో పనులను చేస్తున్న సిబ్బందిని పని ఆఫ్ చేయించారు. ఇరిగేషన్ పర్మిషన్ లేకుండా ఇలాంటి పనులు చేయరాదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కి ఇది వరకే లెటర్ పంపామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కి కూడా ఇక్కడి పరిస్థితులను తెలియజేస్తామని ఈ వాకింగ్ ట్రాక్ నిర్మాణం వల్ల రెండు తూముల లో నీరు వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు.



# శ్యామ్ సింగరాయ్ టీజర్ కి భారీగా వ్యూస్!




నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా చిత్రం శ్యామ్ సింగరాయ్. ఈ చిత్రాన్ని నీహారిక ఎంటర్ టైన్మెంట్ పతాకం పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కి సాయి పల్లవి, కృతి శెట్టి, మడోన్నా సెబాస్టియన్లులు లేడీ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్ విడుదల అయ్యింది. విడుదల అయిన కొద్ది గంటల్లోనే 2 మిలియన్స్ కి పైగా వ్యూస్ రావడం విశేషం. నాని ఈ చిత్రం లో డిఫెరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉ ఒడటం తో సోషల్ మీడియాలో సైతం వైరల్ గా మారుతోంది. మొత్తం నాలుగు బాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రాహుల్ రవీంద్రన్, మురళి శర్మ, అభినవ్ గోమతం లు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 24 వ తేదీన విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు మేకర్స్.

# ఇంట్రెస్టింగ్.."భీమ్లా నాయక్" పై మళ్ళీ సస్పెన్స్..?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు రానా దగ్గుబాటి లు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మల్టీ స్టారర్ చిత్రం "భీమ్లా నాయక్". భారీ అంచనాలు నెలకొల్పుకున్న ఈ చిత్రం రిలీజ్ మొన్ననే మళ్ళీ కన్ఫర్మ్ చేసుకోవడంతో అక్కడ నుంచి మళ్ళీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. ఓ రకంగా భీమ్లా డేట్ తోనే కీలక భేటీలు కూడా జరిగాయని టాక్ ఉంది.మరి దీనితో భీమ్లా నాయక్ రిలీజ్ కానీ ఇతర సినిమాల్లో ఏదోకటి కానీ డేట్ మార్చుకోవాల్సిందే అని ఇంకో స్టార్ట్ స్టార్ట్ అయ్యింది. కానీ ఇప్పుడు మళ్ళీ భీమ్లా నాయక్ చుట్టూతానే సస్పెన్స్ నెలకొన్నట్టు తెలుస్తుంది. మరి భీమ్లా నాయక్ కొత్త గా అనౌన్స్ చేసిన అదే డేట్ తో వస్తుందా లేక ఓ కొత్త డేట్ కి రిలీజ్ చేస్తారా అన్నది ఆసక్తిగా మారింది.మరి దీనిపై క్లారిటీ రావాలి అంటే దీనిపై ఇంకో సాలిడ్ అప్డేట్ రావాల్సిందే. ఇక ఈ చిత్రానికి సాగర్ చంద్ర దర్శకత్వం వహిస్తుండగా త్రివిక్రమ్ మాటలు, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. అలాగే థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# ఆమెకు టాలీవుడ్ పై ఆసక్తి లేదా!!



ఇండస్ట్రీలో కొనసాగాలంటే వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకుంటూ ఉండాలి. చిన్న సినిమాల విషయంల ఆలోచించినా స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్లు వస్తే ఆలోచన లేకుండా కమిట్ అయితేనే భవిష్యత్తు ఉంటుందనే విషయం హీరోయిన్ అమలా పాల్ కు తెలియదు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు విమర్శలు చేస్తున్నారు. హీరోయిన్ గా ఆమె ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేవు. తమిళంలో ఒకటి రెండు సినిమాలు చేస్తున్నా అవి బజ్ ను క్రియేట్ చేయడం లో విఫలం అయ్యాయి. ఒకటి రెండు వెబ్ సిరీస్ ల్లో నటించింది మరియు బాలీవుడ్ లో కూడా ఈమె సినిమాను చేస్తుంది. ఈ సమయంలో ఈమెకు టాలీవుడ్ నుండి నాగార్జున హీరోగా నటిస్తున్న ఘోస్ట్ ఆఫర్ వచ్చిందట.టాలీవుడ్ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం ఘోస్ట్ సినిమాకు ఆమె నో చెప్పిందని వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఘోస్ట్ సినిమాకు గాను ఏకంగా కోటి రూపాయల పారితోషికంను డిమాండ్ చేసిందట. ప్రస్తుతం స్టార్ హీరోయిన్స్ కోటి నుండి కోటిన్నర పారితోషికం అందుకుంటున్నారు. ఇలాంటి సమయంలో అమలా పాల్ తెలుగు లో నటించేందు కోటి డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని మేకర్స్ భావించారు. ఆమె ప్రస్తుత టాలీవుడ్ మార్కెట్ కేవలం 50 లక్షలు మాత్రమే. ఆ మొత్తంను ఇచ్చేందుకు ఘోస్ట్ మేకర్స్ ఓకే చెప్పారని సమాచారం. కాని ఆమె మాత్రం కోటి కావాల్సిందే అంటూ డిమాండ్ చేయడంతో ఆమె స్థానంలో మరో హీరోయిన్ ను ఎంపిక చేసినట్లుగా సమాచారం అందుతోంది.అమలా పాల్ కోటి డిమాండ్ ను చేయడం చూస్తుంటే ఆమెకు టాలీవుడ్ లో నటించే ఆసక్తి లేనట్లుగా ఉందంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. టాలీవుడ్ లో సినిమాలు చేయాలని భావిస్తే ఆమె పారితోషికం విషయంలో రాజీ పడేది. నాగార్జున వంటి స్టార్ హీరో సినిమాలో నటించేందుకు గాను ఆమెకు వచ్చిన ఆఫర్ ఈమధ్య కాలంలో ఆమెకు దక్కిన పెద్ద అవకాశం. కాని ఆ అవకాశంను కూడా ఆమె వదులుకుంది అంటే ఆమె ఆలోచన ఏంటో అర్థం అవ్వడం లేదంటున్నారు. హీరోయిన్ గా ఆమె నటించిన సినిమాలు తెలుగు లో పెద్దగా ఆడిందే లేదు.. పైగా ఆమె పెళ్లి చేసుకుని విడాకులు తీసుకున్న విషయం తెల్సిందే.. అలాంటి హీరోయిన్స్ ను తెలుగు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరు అనేది కూడా తెల్సిందే. అయినా కూడా ఆమె కోటి డిమాండ్ చేయడం వెనుక ఉద్దేశ్యం ఏంటో ఆమె చెప్పాలి.

# పుష్పక విమానం హిందీ రీమేక్ కి మంచి డిమాండ్..!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం "పుష్పక విమానం". ఇటీవలే విడుదలై ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందుతుంది. అయితే మన తెలుగు సినిమాలకి హిందీ మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే.అలా ఇప్పుడు ఈ సినిమా హిందీ రీమేక్ రైట్స్ కోసం మంచి డిమాండ్ ఏర్పడింది. బాలీవుడ్ నుంచి మూడు ప్రముఖ నిర్మాణ సంస్థలు "పుష్పక విమానం" రీమేక్ హక్కుల కోసం పోటీ పడుతున్నాయి. కొత్త తరహా కథలో కామెడీ, మిస్టరీ కలిసి ఉండటం "పుష్పక విమానం" ను యూనిక్ మూవీగా మార్చాయి. సినిమాలోని ఈ క్వాలిటీనే బాలీవుడ్ మేకర్స్ ను రీమేక్ కు పోటీ పడేలా చేస్తున్నాయి. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు. "పుష్పక విమానం" బాలీవుడ్ రీమేక్ గురించి ఈ మూడు ప్రతిష్టాత్మక సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఆ సంస్థల వివరాలు త్వరలోనే అనౌన్స్ చేస్తాం అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అనురాగ్ పర్వతనేని తాజాగా తెలిపారు.

# "రాధే శ్యామ్" పై ఆసక్తికర అప్డేట్స్..!




పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా దర్శకుడు రాధా కృష్ణ తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ చిత్రం "రాధే శ్యామ్". భారీ స్థాయి అంచనాలు ఉన్న ఈ చిత్రాన్ని మేకర్స్ వచ్చే ఏడాది రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. మరి ఈ క్రమంలోనే రీసెంట్ గా రిలీజ్ చేసిన టీజర్ మరియు ఫస్ట్ సాంగ్ కి కూడా భారీ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఇదిలా ఉండగా ఇప్పుడు ఈ చిత్రంపై ఇంట్రెస్టింగ్ సమాచారం తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ హిందీ వెర్షన్ కి సంబంధించి డబ్బింగ్ పనులు స్టార్ట్ చేసాడట. అలాగే సినిమా నుంచి హిందీ సింగిల్ పై కూడా ఇంట్రెస్టింగ్ టాక్ అనుకోవచ్చు. సౌత్ ఆల్బమ్ కి సంబంధించి ఒక వెర్షన్ సాంగ్ ని డిజైన్ చెయ్యగా హిందీకి మాత్రం వేరే వెర్షన్ ని రెడీ చేస్తున్నారు కావచ్చు అందుకే అది మరింత లేట్ అవుతుందని టాక్. దీనిని కూడా మేకర్స్ తొందరలోనే రిలీజ్ చెయ్యనున్నారట.

# బంగార్రాజులో నాగలక్ష్మి గా..
# కృతి శెట్టి ఫస్ట్ లుక్ విడుదల!




అక్కినేని నాగార్జున హీరోగా కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా చిత్రం బంగార్రాజు. ఈ చిత్రం లో అక్కినేని నాగ చైతన్య మరియు ఉప్పెన ఫేం బ్యూటీ కృతి శెట్టి లు కూడా నటిస్తున్నారు. సోగ్గాడే చిన్ని నాయన చిత్రానికి కొనసాగింపు గా వస్తున్న ఈ చిత్రం పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం కి సంబంధించిన ప్రచార చిత్రాలు ప్రేక్షకులని, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఈ చిత్రం నుండి కృతి శెట్టి కి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అయ్యింది. ఈ చిత్రం లో కృతి శెట్టి నాగ లక్ష్మీ పాత్ర లో నటిస్తుంది. ఇందుకు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దింపేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది.

# భారీ రెస్పాన్స్ తో "స్పైడర్ మ్యాన్" సరికొత్త ట్రైలర్.!




ప్రపంచ వ్యాప్తంగా కూడా మర్వెల్ కామిక్స్ కి కానీ వారి ప్రొడక్షన్ నుంచి వచ్చే సినిమాలకు కానీ ఉన్న క్రేజ్ వేరే లెవెల్లో ఉంటుంది. మరి ఇప్పుడు వారి ఫ్రాంచైజ్ నుంచి సరికొత్త ఫేజ్ ని స్టార్ట్ చేసిన యూనిట్ లేటెస్ట్ గా తమ మోస్ట్ అవైటెడ్ సినిమా "స్పైడర్ మ్యాన్ నో వే హెూమ్" నుంచి సరికొత్త ట్రైలర్ ని రిలీజ్ చేసింది. మొదటి ట్రైలర్ తోనే భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఈ ట్రైలర్ తో వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ని ఇంకోసారి కట్టి పడేసింది.ఎన్నో అంచనాలు నడుమ నిన్న రిలీజ్ అయ్యిన ఈ ట్రైలర్ ఇపుడు ఇండియన్ యూట్యూబ్ ట్రెండ్స్ లో కూడా ట్రెండ్ అవుతుంది. మల్టీవర్స్ కాన్సెప్ట్ తో మైండ్ బ్లోయింగ్ గా ఈ సినిమా తెరకెక్కింది. గత స్పైడర్ మ్యాన్ సిరీస్ లలో అందరి విలన్స్ తో అదిరిపోయే విజువల్స్ తో మర్వెల్ ఫ్యాన్స్ కి ట్రీట్ ఇచ్చే విధంగా డైరెక్టర్ జాన్ వాట్స్ తెరకెక్కించారు.ఇక ఈ ట్రైలర్ కి 24 గంటల్లో 31మిలియన్ కి పైగా వ్యూస్ 2 మిలియన్ కి పైగా లైక్స్ సాధించి రికార్డు సెట్ చేసింది. ఈ స్థాయి రెస్పాన్స్ అయితే లాస్ట్ టైం అవెంజర్స్ సిరీస్ కే ఉంది. అంటే ఈ లెక్కన ఈ సినిమా కోసం ఎంత క్రేజీగా ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారో మనం అర్థం చేసుకోవచ్చు.భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 17న థియేటర్స్ లో రిలీజ్ కానుంది. మరి ఈ సినిమా ఓవరాల్ గా ఎంత వసూలు చేస్తుందో అన్నది చూడాలి. అలాగే ముగ్గురు స్పైడర్ మ్యాన్ లు కూడా కనిపిస్తారా లేదా అనే ప్రశ్న ఫ్యాన్స్ ని మరింత ఆసక్తిగా ఈ సినిమా కోసం ఎదురు చూసేలా చేస్తుంది.

# జై భీమ్ మూవీపై కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ట్వీట్..!




తమిళ స్టార్ హీరో సూర్య హీరోగా టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'జై భీమ్'. అమెజాన్ ఓటీటీలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. న్యాయం కోసం ఓ ఆడబిడ్డ పోరాడిన విధానం ప్రతి ఒక్కరి హృదయాలను కరిగించింది. ఈ చిత్రాన్ని వీక్షించిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హీరో సూర్య, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. అయితే తాజాగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీతక్క కూడా ట్విటర్ వేదికగా హీరో సూర్యకు ట్విటర్ వేదికగా అభినందనలు తెలియజేశారు. ఈ సినిమా ఖచ్చితంగా ఆస్కార్ బరిలో నిలిచి అవార్డు సాధిస్తుందని ఆశిస్తున్నానని, చిత్రం బృందానికి ముందస్తుగా నా అభినందనలు అని అన్నారు. అయితే సీతక్క చేసిన ట్వీట్‌కు స్పందించిన హీరో సూర్య మా చిత్ర బృందం తరపున మీకు కృతజ్ఞతలు మేడం అని రిప్లై ఇచ్చారు.



# చిరు "గాడ్‌ఫాదర్"లో సత్యదేవ్ రీప్లేస్‌పై క్లారిటీ..!

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం చేస్తున్న సినిమాల్లో మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మలయాళ చిత్రం లూసిఫర్ రీమేక్ "గాడ్ ఫాదర్" సినిమా ఒకటి. మోస్ట్ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమయ్యింది. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవికి తమ్ముడి పాత్రలో హీరో సత్యదేవ్ నటిస్తున్నాడన్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలో సత్యదేవ్‌కి భార్యగా నయనతార నటిస్తుందని, కానీ తన వయసుకు సత్యదేవ్ సరిపోడని, అతడిని రీప్లేస్ చేయాలని నయన్ కోరినట్టు వార్తలు వినిపించాయి. కానీ ఈ చిత్ర యూనిట్ నుంచి అందిన సమాచారం ప్రకారం సత్యదేవ్ రీప్లేస్ చేయబడ్డాడనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఖచ్చితంగా అతడు ఈ సినిమాలో భాగమవుతాడని, జనవరి నుండి చిత్ర యూనిట్‌తో కూడా జాయిన్ అవుతాడని తెలుస్తుంది.

# పుష్ప అక్కడ స్పీడ్ పెంచాల్సిందేనా.?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్న భారీ సినిమా "పుష్ప". వీరి కాంబో నుంచి వస్తున్న మొట్ట మొదటి పాన్ ఇండియన్ సినిమా ఇది కావడంతో దీనిపై మంచి అంచనాలు కూడా ఉన్నాయి. అయితే ఈ చిత్రం రిలీజ్ కి రెడీ అవుతుండగా ఈ చిత్రం హిందీ రిలీజ్ పట్ల ఈ మధ్య కాస్త సందిగ్ధం నెలకొంది.కానీ మళ్ళీ లైన్ క్లీ అవ్వడంతో హిందీ రిలీజ్ మళ్ళీ ఫిక్స్ అయ్యింది. అయితే ఇప్పుడున్న సమయంలో హిందీ మార్కెట్ కి సంబంధించి ఈ సినిమా స్పీడ్ పెంచాల్సిందే అనిపిస్తుంది. ఇంకా సినిమా షూటింగ్ బ్యాలన్స్ ఉంది. కానీ ఇంకా ప్రమోషన్స్ స్టార్ట్ కావాల్సి ఉంది. మన దగ్గర ఎలాగో పర్లేదు కానీ బన్నీకి ప్రిస్టేజియస్ గా ఉన్న హిందీ మార్కెట్ లో మాత్రం మంచి ప్రమోషన్స్ చెయ్యక తప్పదు. కాస్త ముందే ఈ పని స్టార్ట్ చేస్తే ఈ సినిమాకి ఇంకా మంచిది మరి మేకర్స్ ఎప్పుడు ఇవన్నీ స్టార్ట్ చేస్తారో చూడాలి.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989